


# గండిపేటలోకి గలీజు!

-తాగునీటి జలాశయంలో సెప్టిక్ ట్యాంకులోని విసర్జన వ్యర్థాలు
-రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న స్థానికులు
-జలమండలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన మొయినాబాద్ పోలీసులు




**హైదరాబాద్, డిసెంబరు 18 ప్రభాతవార్త**

నగర ప్రజలకు మంచినీరు అందిస్తున్న గండిపేట జలాశయం గలీజవుతోంది. సెప్టిక్ ట్యాంకు లోని మల,మూత్ర విసర్జన వ్యర్థాలను జలాశయంలో వదులుతున్నారు. ఈ తతంగం ఏన్నాళ్లనుంచి జరుగుతుందోగానీ..బుధవారం స్థానికులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని జలమండలి అధికారులకు అప్పగించారు. దీంతో పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని హిమా యత్‌నగర్ పక్కనే గండిపేట జలాశయం ఉంది. బుధవారం ఇక్కడ ఉన్న కట్టపై ఎఫ్‌టిఎల్ 428 పాయింట్ వద్ద ఓ సెప్టిక్ ట్యాంక్ వాహనం నుంచి మల,మూత్ర విసర్జన వ్యర్థాలను జలాశయంలోకి వదులుతున్నారు. దుర్వాసన రావడంతో గమనించిన స్థానికులు సెప్టిక్ ట్యాంక్ డ్రైవర్‌ను నిలదీశారు. స్థానికులు జలమండలి అధికారులకు సమాచారం ఇవ్వడంతో జలమండలి డిప్యూటీ జనరల్ మేనేజర్ నరహరి అక్కడికి చేరుకుని డ్రైవర్‌ను ప్రశ్నించారు. అది శివనాయక్‌కు సంబంధించిన వాహనమని, హిమాయత్ నగర్ గ్రామంలో నుంచి వ్యర్థాలను తీసుకొచ్చి వదులుతున్నట్లు డ్రైవర్ చెప్పాడు. దీంతో డిజిఎం నరహరి మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు వాహనాన్ని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

జలమండలి తెలిపిన వివరాల ప్రకారం.. హిమాయత్‌నగర్ గ్రామం వద్ద ఉన్నఎఫ్.టీ.ఎల్ పాయింట్ నెంబర్ 428 వద్ద బుధవారం ఉదయం 8 గంటల సమయంలో టీజీ 11 టి1833 నంబర్ గల సెప్టిక్‌ట్యాంకర్ అక్రమంగా మురుగునీటిని జలాశయంలోకి వదలడానికి యత్నించినట్లు పెట్రోలింగ్‌సిబ్బంది గుర్తించారు. విచారణలో, డ్రైవర్ రామావత్ శివ నాయక్ (33), హిమాయత్‌నగర్‌నివాసి నిరంజన్ ఆదేశాల మేరకు ఈ అక్రమ పనికి పాల్పడినట్లు అంగీకరించారు. ఈఘటనలో జలమండలి అధికారులు ప్రధానంగా మూడు అంశాలను గుర్తించారు. సదరు ట్యాంకర్ ఎటువంటి అనుమతి లేకుండా హెచ్‌ఎండబ్ల్యుఎస్‌ఎస్‌బి (జలమండలి) లోగోను వినియోగించారు.ప్రజలను, అధికారులను నమ్మించి, తనిఖీల నుంచి తప్పించుకోవడానికి ఈ విధంగా లోగోను వాడినట్లు తేలింది. ఈ వాహనం బోర్డులో నమోదు చేయబడలేదు.అలాగే నిందితులపై సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, కఠినంగా శిక్షించాలని బోర్డుకోరింది.

రక్షిత జలాశయంలో మురుగునీరు కలపడం వల్ల లక్షలాది మందికి సరఫరా అయ్యే తాగునీరు కలుషితమై ప్రజా ఆరోగ్యం ప్రమాదంలో పడుతుంది.

## ఇలా ఎవరైనా చేస్తే కఠిన చర్యలు : జలమండలి ఎండీ

ఉస్మాన్ సాగర్ జలాశయంలో మురుగునీటిని పారబోసినట్టు సోషల్ మీడియా వేదికగా ప్రచారం అవుతోందని మా దృష్టికి వచ్చింది. ఆ నిజానికి ఒక ట్యాంకర్‌ను మా డిజిఎం పట్టుకొని మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌లో లారీ డ్రైవర్, ఓనర్‌లపై క్రిమినల్ కేస్ నమోదు చేసారని జలమండలి ఎండి అశోక్‌రెడ్డి అన్నారు. అలాగే జంట రిజర్వాయర్లలో చుట్టుపక్కల నుంచి సీవరేజ్ వాటర్ అప్పుడప్పుడు వస్తుందని జలాశయానికి రెండు వైపులా ఎస్టీపీలు నిర్మాణం చేస్తున్నట్లు చెప్పారు. మరో ఆరు నెలల్లో ఆ ఎస్టీపీలు పూర్తయితే ఆ ప్రాంతంలోని నుంచి వచ్చే సీవరేజ్‌ని కూడా 100 శాతం ట్రీట్మెంట్ చేయడానికి వెసులుబాటు దొరుకుతుందని ఎండీ వివరించారు.అలాగే ఉస్మాన్‌సాగర్ ఎలాంటి వ్యర్థాలు కలవలేదని, ఈ ఘటనపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఐఎస్ ప్రమాణాలతో మూడంచెల క్లోరిన్ ప్రక్రియ ద్వారా నీటి సరఫరా జరుగుతుందని, కాబట్టి డ్రింకింగ్ వాటర్‌కి సంబంధించిన ఎలాంటి సమస్య లేదన్నారు. జలమండలి గండిపేట నీటిని ఆసిఫ్‌నగర్, మీరాలం వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్లకు తరలించి ప్రతి గంటకూ నీటి ప్రమాణాలను పరీక్షిస్తామని ఎండీ అశోక్ రెడ్డి వెల్లడించారు. అక్కడ నీటి సరఫరాలో జలమండలి ఇప్పటికే మూడంచెల క్లోరినేషన్ ప్రక్రియ పద్ధతిని అవలంబిస్తుందని ఆయన తెలిపారు. మొదటి దశలో నీటి శుద్ధి కేంద్రాల (డబ్ల్యూటీపీ) వద్ద, రెండో దశలో మెయిన్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల (ఎంబీఆర్) వద్ద, చివరగా సర్వీస్ రిజర్వాయర్ల వద్ద బూస్టర్ క్లోరినేషన్ ప్రక్రియ జరుగుతుందని పేర్కొన్నారు. తాగునీటి వనరులను కలుషితం చేసే ఏ చర్యలనైనా బోర్డు సహించబోదని..

అలాంటి వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎండి అశోక్ రెడ్డి హెచ్చరించారు.



హైదరాబాద్ వార్త

# శరవేగంగా డీలిమిటేషన్ ప్రక్రియ..

-అభ్యంతరాలు వెంటనే పరిశీలిస్తున్న ప్రత్యేక టీంలు
-అంశాల వారీగా ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదిక
-పలువార్డుల పేర్లు మార్చే యోచనలో జిహెచ్ఎంసి




**హైదరాబాద్, డిసెంబరు 18, ప్రభాతవార్త:**

డీలిమిటేషన్ ప్రక్రియని జీహెచ్ఎంసీ అధికారులు వేగవంతం చేశారు. గత వారం రోజుల జోనల్, సర్కిల్, కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక టీంల ద్వారా అభ్యంతరాలను స్వీకరిస్తున్నారు. అలా స్వీకరించిన దరఖాస్తులు జోన్ల వారీగా వేసిన ఉన్నతాధికారులు కమిటీ పరిశీలించి ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదిస్తుంది. వచ్చిన దరఖాస్తులల్లో ఉన్న అభ్యంతరాలు ఏంటీ.. ఎక్కువగా దేనిపై వస్తున్నాయి. వాటి పరిష్కార మార్గాలపై జిహెచ్ఎంసి కమిషనర్ పలువురు ఉన్నతాధికారులతో చర్చిస్తున్నారు. ఎలాగైనా వారం రోజుల్లో ఈప్రక్రియ పూర్తిచేసి ఫైనల్ నోటిఫికేషన్ ఇచ్చేలా ప్రణాళికలు సిద్దం చేసుతన్నారు. 27యూఎల్బీల విలీనం, 300వార్డుల పునర్విభజనకు సంబంధించిన అభ్యంతరాల పరిశీలన, పరిష్కారం అనంతరం ప్రభుత్వానికి రిపోర్టు పంపించనున్నారు. ఆతర్వాత జీహెచ్ఎంసీ ఇచ్చిన రిపోర్టును పరిశీలించి ప్రభుత్వం ఫైనల్ నోటిఫికేషన్ జారీచేసే అవకాశాలు ఉన్నాయి.

**అంశాల వారీగా..**

సర్కిల్, జోనల్, హెడ్ ఆఫీసు స్థాయిలో వచ్చిన అభ్యంతరాలను వేర్వేరుగానే రికార్డు చేస్తున్నారు. దీంతోపాటు అంశాలవారీగాను ఫైల్ చేస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. ఇదివరకు వచ్చిన వాటిలో ఎక్కువగా వార్డుల పేర్లు మారాయని, వార్డు పేరుతో ఉన్న ప్రాంతాలు ఆ డివిజన్ లో కాకుండా పక్కన డివిజన్లలోకి వచ్చాయని అభ్యంతరాలు వచ్చాయి. దీంతో పాటు వార్డుల బౌండరీలు సరిగ్గాలేవని, బౌండరీల హద్దులు ఎక్కడ ఉన్నాయో తెలియడంలేదని కూడా వచ్చాయి. ఇక ఇదివరకు ఉన్న వార్డులను రెండు, మూడు, నాలుగు ముక్కలుగా చేసిన విభజించారని కూడా వచ్చాయి. అలాగే జనరల్ బాడీ మీటింగ్ లో వచ్చిన సలహాలు, సూచనలపై కూడా టౌన్ ప్లానింగ్, ఎన్నికల విభాగం అధికారులు కసరత్తు చేస్తున్నారు. అలాగే ప్రస్తుతం వార్డుల డీలిమిటేషన్ కి సంబంధించి ఫైనల్ నోటిఫికేషన్ విడుదలైన తరువాత కార్పొరేషన్ ను రెండు చేయాలా? మూడు చేయాలా? అనే అంశంపైనా ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తెలుస్తుంది. అలాగే కార్పొరేషన్ల బౌండరీలు ఫిక్స్ చేసి అధికారుల, సిబ్బంది కేటాయించిన అనంతరం ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉంటుంది.

దీంతోపాటు వార్డుల కు సంబంధించిన ఫైనల్ నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత కూడా ఎన్నికల సమయంలోనూ మార్పులు చేసే అవకాశముంటుందని అధికారులు చెబుతున్నారు. జనాభా, సరిహద్దులు, రిజర్వేషన్లు కూడా మార్చే అవకాశాలు ఉన్నాయంటున్నారు.

# నేటి నుంచి 38వ హైదరాబాద్ బుక్ ఫెయిర్

-సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు కవి యాకూబ్, ఆర్.వాసు




సమావేశంలో మాట్లాడుతున్న బుక్‌ఫెయిర్ ప్రధాన కార్యదర్శి ఆర్.వాసు

**ముషీరాబాద్, డిసెంబర్ 18, ప్రభాతవార్త:** పుస్తక విలువ, ప్రాముఖ్యతను సమాజంలోకి తీసుకువెళ్తే సమాజం వెలుగుతుందని, సమాజ హితం కోసమే పుస్తక ప్రదర్శన నిర్వహించటం జరుగుతోందని హైదరాబాద్ బుక్‌ఫెయిర్ సొసైటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కవి యాకూబ్, ఆర్.వాసులు స్పష్టం చేశారు. గురువారం ఎన్టీఆర్ స్టేడియంలోని బుక్‌ఫెయిర్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు వివరాలు వెల్లుడించారు. నేటి నుంచి ఈనెల 29 వరకు ఎన్టీఆర్ స్టేడియంలో కొనసాగనున్న 38వ హైదరాబాద్ బుక్‌ఫెయిర్‌ను రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరై ప్రారంభిస్తారని తెలిపారు. పుస్తక పఠనాన్ని ప్రజల్లోకి, సాహిత్యకారుల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లేందుకు మొట్టమొదటిసారిగా బుక్‌ఫెయిర్‌లో పుస్తక స్ఫూర్తి ఫైలాన్ ఏర్పాటుచేస్తున్నామని అన్నారు. ఈ స్ఫూర్తి ఫైలాన్‌ను జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఆవిష్కరిస్తారని, ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంకు గౌరవ అతిధులుగా ఎమ్మెల్సీ కోదండరాం, కే.రామచంద్రమూర్తి, రమా మేల్కొటె పాల్గొంటారని తెలిపారు. ఈ సారి పుస్తక ప్రదర్శన ప్రాంగణంకు ప్రజాకవి అందెశ్రీ పేరును, ప్రధాన వేదికకు అనిశెట్టి రజిత పేరును, పుస్తకావిష్కరణల వేదికకు, సాహితీవేవత్త కొంపల్లి వెంకట్‌గౌడ్ పేరును రైటర్స్ స్టాల్స్‌కు ప్రొఫెసర్ ఎస్.వి.రామారావు పేరును, మీడియా స్టాల్స్‌కు స్వేచ్ఛ ఒటార్కర్ పేరును పెట్టాలని నిర్ణయించామని పేర్కొన్నారు. ప్రతి రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు బాలోత్సవ కార్యక్రమం, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు, సాయంత్రం 6 నుంచి 9 వరకు పుస్తక స్ఫూర్తి కార్యక్రమాలు జరుగుతాయని అన్నారు. పుస్తక సందర్శకుల కోసం కొత్త సౌకర్యాలు ఏర్పాటుచేయటం జరిగిందని, పిల్లల కోసం ఆట వస్తువుల ప్రదేశం, పెద్దలకు అనువుగా కుర్చీలు, ప్రాంగణం లోపలే కాఫీ, టీలు, ప్రాంగణానికి ఇరువైపులా మెరుగైన టాయిలెట్స్ ఏర్పాటుచేయటం జరిగిందని వివరించారు. భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో నిర్వహిస్తున్న పుస్తక ప్రదర్శన ప్రతి రోజూ మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 9 గంటల వరకు సందర్శించవచ్చునని, విద్యార్థులకు ప్రవేశం పూర్తిగా ఉచితమని వివరించారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు బాల్‌రెడ్డి, బి.శోభన్‌బాబు, సంయుక్త కార్యదర్శులు కే.సూరిబాబు, పి.నారాయణరెడ్డి, కోశాధికారి నారాయణరెడ్డి పాల్గొన్నారు.

# ట్రాఫిక్‌పై కీలక శాఖల 'సమన్వయ సమావేశం'




ఉన్నతాధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న నగర సీపీ సజ్జనార్, చిత్రంలో జిహెచ్ఎంసి కమిషనర్ కర్ణన్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డెవిస్, జలమండలి ఎండి అశోక్‌రెడ్డి తదితరులు

**హైదరాబాద్, డిసెంబరు 18 ప్రభాతవార్త :**

నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, వర్షాకాలపు సవాళ్లు,ప్రజా భద్రతను మెరుగుపరిచే లక్ష్యంతో నగర పోలీస్ కమిషనర్ విసి సజ్జనర్ అధ్యక్షతన గురువారం వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమన్వయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రధాన జంక్షన్లలో రద్దీని తగ్గించేందుకు రోడ్ల మరమ్మతులు,పెండింగ్‌లో ఉన్న జంక్షన్ ఇంప్రూవ్‌మెంట్ పనులను వేగవంతం చేయాలని, వర్షాకాలంలో రోడ్లపై నీరు నిలవకుండా ఉండేందుకు డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడంపై చర్చించారు. మలక్‌పేట వంటి ప్రాంతాల్లో విజయవంతమైన రోబోటిక్ క్లీనింగ్ విధానాన్ని అన్ని వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద అమలు చేయాలని నిర్ణయించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న బస్ స్టాప్‌లను రోడ్డు వెడల్పు ఎక్కువగా ఉన్న చోటికి మార్చడం, రోడ్డు మధ్యలో ఉన్న సులాబ్ కాంప్లెక్సులను తొలగించడం,పాదచారుల కోసం ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను నిర్మించాలని నిర్ణయంచారు. నగరంలో పెరుగుతున్న వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకొని మల్టీ లెవల్ పార్కింగ్ సదుపాయము ఏర్పాట్లు చేయాలని, అందుకు మల్టీ లెవల్ పార్కింగ్ యాప్"ను తీసుకురావాలని నిర్ణయించారు.ఈ సందర్భంగా ఈ ఉన్నతాధికారుల సమావేశంలో సీపీ సజ్జనర్ మాట్లాడుతూ 'పోలీస్,మున్సిపల్ విభాగాలు సమన్వయంతో పనిచేసినప్పుడే ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయన్నారు. జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ మాట్లాడుతూ వాటర్ బోర్డు, విద్యుత్ ఇతర స్థానిక సంస్థలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. క్షేత్ర స్థాయి అధికారులకు అధికారాలను, బడ్జెట్‌ను బదిలీ చేస్తామని, దీనివల్ల క్షేత్రస్థాయిలో పనులు వేగవంతం అవుతాయని తెలిపారు. సమస్యలను స్వల్పకాలిక (15 రోజులు), మధ్యకాలిక (13 నెలలు), దీర్ఘకాలిక (3 నెలల పైబడి) అని వర్గీకరించి పరిష్కరిస్తాం. నగరంలో పెరుగుతున్న వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని, పార్కింగ్ సౌకర్యాలను మెరుగుపరచడానికి "మల్టీ లెవల్ పార్కింగ్ యాప్"ను త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాయని వెల్లడించారు. ఈ యాప్ ద్వారా వాహనదారులు తమకు సమీపంలో ఉన్న పార్కింగ్ స్థలాలను సులభంగా గుర్తించే అవకాశం కలుగుతుందన్నారు.హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్ మాట్లాడుతూ వర్షాకాలంలో నీరు నిలిచే ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపుతామని, ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలను తొలగించడానికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ట్రాఫిక్ జాయింట్ సీపీ డి. జోయల్ డెవిస్ మాట్లాడుతూ సామాన్య ప్రజలకు,వాహనదారులకు అంతరాయం కలగకుండా బస్టాపులను ఏర్పాటు చేయాలని, ప్రస్తుతం ట్రాఫిక్ రద్దీకి కారణమవుతున్న బస్టాండ్‌లను రోడ్డు వెడల్పు ఎక్కువగా ఉన్న ప్రదేశాలకు మార్చడం ద్వారా సమస్యను తగ్గించవచ్చన్నారు.కొన్ని ప్రాంతాల్లో రోడ్లపైనే నిర్మించిన సులాబ్ కాంప్లెకుల వల్ల ట్రాఫిక్‌కు ఆటంకం కలుగుతోందని, వీటిని గుర్తించి అనువైన ఇతర ప్రదేశాలకు తరలించాలన్నారు. పాదచారులు నేరుగా రోడ్లపై నుండి దాటడం వల్ల ట్రాఫిక్ వేగం తగ్గుతోంది. అవసరమైన చోట ఫుట్ ఓవర్ బ్రిడ్జులను నిర్మిస్తే వాహనాల రాకపోకలు సులువుగా సాగుతాయన్నారు.ఇటీవల వర్షాకాలంలో నీరు నిలిచే పాయింట్ల వద్ద చేపట్టిన రోబోటిక్ క్లీనింగ్ మంచి ఫలితాలను ఇచ్చిందని,నగరం అంతటా అమలు చేస్తే మేలవుతుందన్నారు. పురానాపూల్, బహదూరాపురా, ఎం.జె.మార్కెట్, మాసాబ్ ట్యాంక్, బేగంపేట వంటి ప్రదేశాలలో రోడ్డు మధ్యలో రేలింగ్ లేకపోవడం వల్ల పాదచారులు, వాహనదారులు విచ్చలవిడిగా రోడ్డు దాటుతున్నారు. ప్రమాదాలను నివారించడానికి,ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ఈ ప్రాంతాల్లో రేలింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ఉస్మానియా ఆసుపత్రితో పాటు ఇతర స్థలాలలో ఆటోలను విచ్చలవిడిగా పార్కింగ్ చేయడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోందన్నారు. ఈ సమస్య పరిష్కారానికి ప్రత్యేక స్థలాలను ఏర్పాటుకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. సైబరాబాద్ జాయింట్ సీపీ గజరావు భూపాల్, మాట్లాడుతూ రోడ్డు తవ్వకాలు జరిపినప్పుడు ప్యాచ్ వర్క్ ఆలస్యం కాకుండా ఉండేందుకు, తవ్వకం మరమ్మతు పనులను ఒకే కాంట్రాక్టరుకు అప్పగించే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. జలమండలి ఎండి అశోక్ రెడ్డి మాట్లాడుతూ నగరములోని సెవరేజ్, డ్రైనేజ్ లను ఇంకా అభివృద్ది చేయడానికి చర్యలు చేపట్టినామని తెలిపారు.పాలిథిన్ కవర్లు డ్రైనేజిలో వేయడం మానుకోవాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్లు, జోనల్ కమిషనర్లు, ట్రాఫిక్ డీసీపీలు, హెచ్.ఎం.డి ఎ, జిసిఐ, కంటోన్ మెంట్, హైడ్రా, వాటర్ వర్క్స్ ఇతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# క్రిస్మస్ విందుకు పనులు వేగవంతం చేయాలి

ఎల్‌బి స్టేడియంలో అధికారులతో మంత్రి అజారుద్దీన్



ఎల్‌బి స్టేడియంలో వివిధ శాఖల అధికారులతో సమావేశమైన మంత్రి అజారుద్దీన్

**సైఫాబాద్, డిసెంబరు 18 ప్రభాతవార్త:**

రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా క్రిస్టమస్ పండుగ సందర్భంగా విందు కార్యక్రమాన్ని చేపడుతున్న నేపథ్యంలో శాఖల వారిగా కేటాయించిన పనులను వేగవంతగా పూర్తి చేయాలని రాష్ట్ర మైనార్టి సంక్షేమ శాఖ మంత్రి మొహమ్మద్ అజారుద్దీన్ అధికారులను ఆదేశించారు. గురువారం బషీర్‌బాగ్‌లోని ఎల్‌బి స్టేడియంలో ఈ నెల 20న జరిగే విందు కార్యక్రమంను పురస్కరించుకుని ఉన్నతాధికారులతో సమావేశమై సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో పాల్గొన్న క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పోరేషన్ ఛైర్మన్ దీపక్ జాన్, కార్యదర్శి షఫి ఉల్లా, కార్పోరేషన్ వైస్-ఛైర్మన్ క్రాంతి వెస్లీ తదితర అధికారులను కోరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లడుతూ ప్రభుత్వం చేపట్టె విందు కార్యక్రమాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు తమ అనుభవాలను సమన్వయంతో కలిసి విజయవంతం చేయాలని కోరారు. విందుకు వచ్చే అతిధులకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. నిరంతరం విద్యుత్, తాగునీరు, తాత్కాలిక మరుగుదోడ్లు, సౌర్‌ప్రూఫ్ జనరేటర్‌ను అందుబాటులో ఉంచాలని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు, ప్రజా ప్రతినిధులు, క్రైస్తవ సోదరులు పదివేల మందికిపైగా పాల్గొనడం జరుగుతుందన్నారు. ట్రాఫీక్‌కు అంతరాయం కలగకుండా చూడాలని పోలీస్ అధికారులను ఆయన కోరారు.

# లింగంపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో అగ్నిప్రమాదం



మంటలను అర్పుతున్న ఫైర్ సిబ్బంది

**శేరిలింగంపల్లి, డిసెంబర్ 18 ప్రభాతవార్త**

లింగంపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఓ నిర్మాణ సంస్థకు చెందిన కూలీలు నివాసముంటున్న షెడ్లలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సంఘటనాస్థలానికి సమీపంలో 52 అంతస్తుల భారీ భవన నిర్మాణ సముదాయం నిర్మాణ పనులు జరుగుతుండటంతో వాటిలో పనిచేసే కార్మికుల కోసం రేకుల షెడ్డులను ఏర్పాటు చేశారు. గురువారం ఆ షెడ్లలో అకస్మాత్తుగా సిలెండర్ పేలడంతో మంటలు చెలరాగాయి. ఆ సమయంలో కార్మికులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.వరుస అగ్నిప్రమాదాలకు బెంబెలెత్తుతున్న జనంశేరిలింగంపల్లి నియోజకవర్గంలోని చందానగర్,లింగంపల్లిలో వరుస అగ్నిప్రమాదాలతో జనం బెంబెలెత్తుతున్నారు. ఇటీవల చందానగర్‌లోని ఓ వ్యాపార సంస్థలో షార్ట్‌సర్క్యూట్ జరిగి భవనం పూర్తిగా దగ్ధమయ్యింది. తాజాగా లింగంపల్లిలోని రైల్వేస్టేషన్ సమీపంలోని బడా రియల్‌ఎస్టేట్ కంపెనీలో పనిచేస్తున్న కార్మికుల కోసం వేసిన రేకుల షెడ్డుల్లో సిలెండర్ పేలి అగ్నిప్రమాదం జరగటంతో ఇక్కడి ప్రజలు భయభ్రాంతులకు గురువుతున్నారు. రియల్ ఎస్టేట్ సంస్థలు వారి గృహనిర్మాణ ప్రాజెక్టులో పనిచేసేందుకు ఒరిస్సా, బీహార్, చత్తీస్‌ఘడ్,ఉత్తరప్రదేశ్ వంటి ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను ఇక్కడకు కాంట్రాక్ట్ పద్దతిలో తీసుకువచ్చి వారితో నిర్మాణ పనులను చేయిస్తుంటారు. కాగా కార్మికులకు సరైన వసతులు కల్పన,వర్క్‌సైట్‌లో రక్షణ ప్రశ్నార్థకంగా మారుతున్నాయి. తాజాగా జరిగిన భారీ అగ్నిప్రమాదంతో రేకుల షెడ్డులు కాలి బూడదయ్యాయి. ఎవరికీ ఏలాంటి ప్రాణ నష్టం వాటిల్లకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. సమాచారం అందుకున్న వెంటనే ఫైర్‌సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదులోనికి తీసుకువచ్చే ప్రయత్నం చేశారు. ఈ మేరకు చందానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# వట్టెపల్లిలో వ్యక్తిపై కత్తితో రౌడీషీటర్ దాడి

**మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబరు 18 ప్రభాతవార్త :** పాతకక్షలు కారణంగా రౌడీ షీటర్ కత్తితో ఓ వ్యక్తిపై దాడి జరిపినసంఘటన బుధవారం అర్ధరాత్రి మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.తీవ్ర గాయాల పాలైన ఆ వ్యక్తి మెహిదీపట్నంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనతో స్థానిక ప్రజలుతీవ్ర భయాందోళనకు గురియ్యారు.మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ కథనం ప్రకారంసయ్యద్ సోహెల్ (25) బాలాపూర్ పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటర్.కాగా వట్టెపల్లి ప్రాంతానికి చెందిన జమీల్‌కురౌడీషీటర్ సయ్యద్ సోహెల్ మధ్య గత కొంత కాలంగా పాతకక్షలు ఉన్నాయి. బుధవారం అర్ధరాత్రి సమయంలో జమీల్ వట్టెపల్లిలోని ఓ హోటల్ వద్ద ఉన్నాడు.విషయం తెలుసుకున్న రౌడీ షీటర్ సయ్యద్ సోహెల్ అక్కడకు చేరుకుని తన వెంట తెచ్చుకున్న కత్తితో జమీల్‌పై విచక్షణ రహితంగా దాడి చేశాడు.ఒక్కసారి స్థానికులు భయభ్రాంతులకు గురియ్యారు.తీవ్ర గాయాల పాలైన జమీల్ మెహిదీపట్నంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.రౌడీషీటర్ సయ్యద్ సోహెల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.ఈ కేసును మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు అన్ని కోణాలు నుంచి విచారిస్తున్నారు.

# నాంపల్లి కోర్టుకు బాంబు బెదిరింపు

-తనిఖీలు చేపట్టిన బాంబు స్క్వాడ్



**హైదరాబాద్ డిసెంబరు 18 ప్రభాతవార్త ;**

అత్యంత రద్దీగా ఉండే నాంపల్లి కోర్టు సముదాయానికి బాంబు బెదిరింపు కలకలం సృష్టించింది. గురువారం మధ్యాహ్నం 2 గంటలకు కోర్టులో బాంబు పేలుతుందంటూ ఈమెయిల్ వచ్చింది. బాంబు బెదిరింపుతో కోర్టు సిబ్బంది, న్యాయవాదులు, కక్షిదారులు భయాందోళనకు గురయ్యారు. దీంతో సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు రంగంలోకి దిగి కోర్టు పరిసరాలను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. కోర్టులో ఉన్న న్యాయవాదులు, సిబ్బంది, ప్రజలను బయటకు పంపారు.భద్రతా కారణాల దృష్ట్యా కోర్టు పరిసరాలను పూర్తిగా ఖాళీ చేయించారు. బాంబు బెదిరింపు నేపథ్యంలో పోలీసులు, బాంబు డిటెక్షన్ అండ్ డిస్పోజల్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో కలిసి కోర్టులోని ప్రతి గదిని, వాహనాల పార్కింగ్ ప్రాంతాలను అణువణువూ తనిఖీ చేశారు. ఎవరూ లోపలికి రాకుండా ప్రవేశ ద్వారాల వద్ద ఆంక్షలు విధించారు. అయితే ఎలాంటి పేలుడు పదార్థాలు లభించినట్లు సమాచారం లేదు.దీంతో అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. బెదిరింపు ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరు చేశారు? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.కాగా గురువారం జరగాల్సిన అన్ని కోర్టు కార్యకలాపాలను ప్రస్తుతానికి పోలీసులు నిలిపివేసినట్లు సమాచారం.

# గుడిమల్కాపూర్ పూల మార్కెట్‌లో రోడ్డును పునరుద్ధరించాలి




పూల మార్కెట్ లోని 60 ఫీట్ల రోడ్డును పునరుద్ధరించాలని డిసికి వినతిపత్రం ఇస్తున్న మాజీ కార్పొరేటర్ బంగారి ప్రకాష్

మెహిదీపట్నం, డిసెంబర్ 18, ప్రభాతవార్త : గుడిమల్కాపూర్ పి.ఇంద్రారెడ్డి పూల మార్కెట్ లోని 60 ఫీట్ల రహదారిని పునరుద్ధరించాలని కోరుతూ గురువారం గుడిమల్కాపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ బంగారి ప్రకాష్ ఆధ్వర్యంలో మెహిదీపట్నం సర్కిల్ 12 డిప్యూటీ కమిషనర్ దశరథను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బంగారి ప్రకాష్ మాట్లాడుతూ..గుడిమల్కాపూర్ మార్కెట్ రహదారి నిత్యం రద్దీగా మారి స్థానిక ప్రజలు అనేక అవస్థలకు గురవుతుండడంతో 2016వ సంవత్సరంలో జిహెచ్‌ఎంసి అధికారులు గుడిమల్కాపూర్ పి.ఇంద్రారెడ్డి పూల మార్కెట్ లోపల నుంచి 60 ఫీట్ల రహదారిని తీయడం జరిగిందని గుర్తు చేశారు. ఈ రహదారిని నవోదయ కాలనీ, మందుల గూడ, బాంబే కాలనీ, బుడగ జంగం బస్తి, సత్యనారాయణ నగర్, బాలాజీ నగర్, హీరా నగర్, భోజగుట్ట, శాంతినగర్, మహేష్ నగర్, ఎస్.బి.ఐ కాలనీ ప్రజలు కొత్త కాలం వినియోగించడంతో ట్రాఫిక్ సమస్యలు తీరాయన్నారు. కొద్ది రోజుల తర్వాత మార్కెట్ పాలకమండలి, అధికారులు పూలదండల షాపులకు అనుమతులు ఇచ్చి షెడ్లను ఏర్పాటు చేయడంతో జిహెచ్‌ఎంసి రోడ్డు వెడల్పు తగ్గిపోయి మళ్లీ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. జిహెచ్‌ఎంసి రోడ్డును ఆక్రమించుకొని వేసిన షెడ్లను తొలగించి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో రావుల మహేందర్ లు ఉన్నారు.

## క్రైస్తవులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలి : మత్తయ్య



సమావేశంలో మాట్లాడుతున్న జెరుషాలెం మత్తయ్య

సైఫాబాద్, డిసెంబరు 18 ప్రభాతవార్త: క్రైస్తవులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఆల్ ఇండియా దళిత, క్రైస్తవ సంఘాల సమాఖ్య అధ్యక్షుడు, క్రీస్తు ధర్మ ప్రచార, పరిరక్షణ సమితి అధ్యక్షుడు జెరుషాలెం మత్తయ్య డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఈనెల 20వ తేదీన ఎల్‌బి స్టేడియంలో సిఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో జరిగే క్రిస్టమస్ డిన్నర్ ఉత్సవాన్ని క్రైస్తవులు బహిష్కరించాలని, వేదికపైన ఉన్నవారికి నల్లజెండాలతో నిరసన తెలపాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ మేరకు గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడి యా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభు త్వం అధికారంలోకి వచ్చి రెండేళ్ళు గడిచిందని, క్రైస్తవులకు సంక్షే మ పథకాలను అమలు చేయలేదని, ఎన్నికల మ్యానిఫెస్టోలో, క్రిస్టియన్ డిక్లరేషన్ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభు త్వం విఫలం చెందిందని ఆరోపించారు. క్రైస్తవుల జెరుషాలెం యా త్రకు ప్రభుత్వం పూర్తిగా సహకరించాలని, పాస్టర్లకు నెలకు పదిఎ్‌ేల రూపాయలు గౌరవ వేతనం చెల్లించాలని, సమాధులకు స్థలాలు కేటాయించాలని, చర్చల్లో ప్రార్థనలు జరుపుకునేందుకు అనుమతు లు, నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలా గే రాజ్యాంగపరమైన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఛైర్మన్ పదవులు క్రైస్త వులకు కేటాయించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం విడనాడాలని, చర్చి లపై దాడులు జరగకుండా ఉండేందుకు ప్రత్యేక చట్టాన్ని రూపొందించా లని, క్రిస్టియన్ భవనం నిర్మాణం పూర్తి చేయాలని ఆయన కోరారు.

## అయ్యప్పస్వామి మహాపడి పూజ



అయ్యప్పస్వామి పడిపూజలో పాల్గొన్న గురుస్వామిని సన్మానిస్తున్న దృశ్యం

అఫ్జల్‌గంజ్ ,డిసెంబర్ 18 ప్రభాతవార్త: స్వామివివేక నంద నగర్ మణికంఠ ఆశ్రమం ఆద్వర్యంలో కనక దుర్గమ్మ ఆలయంలో ఉన్న శబరిమలై అయ్యప్పస్వామి మహాపడి పూజ అత్యంత భక్తి శ్రద్దల మధ్య జరిగింది.అత్యంత వైభవంగా,చూడ ముచ్చటగా కొనసాగింది.అనంతరం అయ య్యప్పస్వామిఅభిషేకం,మహాపడి పూజలను చేయడంతోపాటు అయ్యప్పస్వాములు ప్రత్యేక భజన గీతాలను ఆలపించారు.మణికంఠ ఆశ్రమం వ్యవస్థాపకులు దివంగత ఎం.కిషన్‌గురుస్వామి చిత్రపటానికి పూలమాలలు వేశారు.ఈ పూజ కార్యక్రమంలో మహాపడి పూజలో గడ్డం లక్ష్మన్ గురు స్వామి, సిహెచ్ యాదగిరిగురుస్వామి,ప్రవీణ్ గురుస్వామి పర్యవేక్షణలో మహాపడి పూజ కార్యక్రమం కొనసాగింది.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.భక్తులకు అన్నదానం చేశారు. కాలేవాలే గజార్,ప్రవీణ్ గురుస్వామి అన్నదాన ప్రభువు వ్యవహరించారు. సన్నిదానంలో గురుస్వామిని అయ్యప్పమెమెంటోను అందచేసి సన్మానించారు.ఈకార్యక్రమంలో కొర్నిగణేష్ గురుస్వామి, జయపాల్‌గురుస్వామి శివగురుస్వామి,కన్నె,కత్తి, గంట,గదా స్వాములు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు.

## ప్రజా శ్రేయస్సు కొరకు ప్రజాఏక్తా పార్టీ : శ్రీనివాస్‌గుప్త




ప్రజా ఏక్తా పార్టీ తెలంగాణ మహిళా అధ్యక్షురాలుగా గడ్డం పద్మజ

గోషామహల్,డిసెంబర్ 18ప్రభాతవార్త: అపదలో ఉన్న సమయంలో ప్రజలను ఆదుకునేందుకుగాను పుట్టిన పార్టీ ప్రజా ఏక్తా పార్టీ అని ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్‌గుప్త అన్నారు.ఈ మేరకు మల్కాజిగిరి అసెంబ్లీకి చెందిన గడ్డం పద్మజను తెలంగాణ మహిళా అధ్యక్షురాలుగా నియమించి నియామక పత్రాన్ని అందచేశారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ కులమతాలకు అతీతకంగా ప్రజా ఏక్తా పార్టీ నూతన సంవత్సరం నుంచి క్రియాశీల రాజకీయాల్లో చురుకుగా పాల్గొంటామని చెప్పారు.మహిళా అభ్యున్నతికి ప్రత్యేక స్థానం కల్పిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ తెలుగు సాహిత్యానికి చుక్కాని డా. తెన్నేటి సుధాదేవి : డా. కె.వి.రమణాచారి



డా. తెన్నేటి సుధాదేవి సంస్మరణ సభలో మాట్లాడుతున్న రమణాచారి, పుష్పలత రమణ, విజయలక్ష్మి, వంశీరామరాజు తదితర అతిథులు

నాంపల్లి, డిసెంబరు 18 ప్రభాతవార్త : ఒక కథా నాటక వ్యాస రచయిత్రిగా, కవయిత్రిగా బహుముఖ ప్రజ్ఞాశీలి అయిన డా. తెన్నేటి సుధాదేవి స్త్రీమూర్తి, ఆదర్శమూర్తి, మృదుస్వభావి, నిగర్వి అయిన డా. తెన్నేటి సుధాదేవి ప్రపంచ తెలుగు సాహిత్యానికి చుక్కాని అని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి కొనియాడారు. రెడ్‌హిల్స్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ప్రముఖ మహిళా రచయిత్రుల వేదిక లేఖిని ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షురాలు అత్తలూరి విజయలక్ష్మి నేతృత్వంలో జరిగిన డా. తెన్నేటి సుధాదేవి సంస్మరణలో సభలో ముఖ్యఅతిథిగా డా. కె.వి.రమణాచారి పుష్పలత రమణ దంపతులు ఆమె చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి మాట్లాడుతూ గొప్ప పరిణతి చెందిన మహిళగా తెలుగు అకాడమీలో డిప్యూటీ డైరెక్టర్‌గా, అకాడమీలో 32ఏళ్లపాటు పనిచేయడంతోపాటు పత్రికకు సంపాదకురాలిగా పనిచేయడం సహజ నైపుణ్యానికి, దక్షణకు తార్కాణమన్నారు. సుధాదేవి యావత్ మహిళా లోకానికే స్ఫూర్తి అని ఘననివాళుల ర్పించారు. ఈ సందర్భంగా పలువురు రచయిత్రులు సుధాదేవి రచనలపై, ఆమె వ్యక్తిత్వం, తమ సంబంధ అనుబంధాల గురించి ప్రసంగించారు.

## తెలంగాణ జానపద ఉద్యమ వాగ్గేయకారుడు సుద్దాల హనుమంతు



ప్రసంగిస్తున్న ప్రముఖ హాస్య అవధాని శంకర నారాయణ

చిక్కడపల్లి డిసెంబర్ 18 (ప్రభాతవార్త) : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం లో పెన్ను గన్ను పట్టిన జానపద ఉద్యమ వాగ్గేయకారుడు సుద్దాల హనుమంతు అని ప్రముఖ జర్నలిస్ట్ హాస్య అవధాని శంకర నారాయణ అన్నారు. గురువారం శ్రీ త్యాగరాయ గానసభ లోని కళా సుబ్బారావు కళా వేదిక పై గానసభ నిర్వహణలో అధ్యక్షుడు కళా వి ఎస్ జనార్ధన మూర్తి అధ్యక్షతన జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపర లో భాగంగా సుద్దాల హనుమంతు యాది లో పేరిట సంస్మరణ సమావేశం జరిగింది ముఖ్య అతిథిగా శంకర నారాయణ పాల్గొని మాట్లాడుతూ గొప్ప గా చదువుకోకున్నా సమాజాన్ని బడుగు బలహీన వర్గాల ప్రజలు జీవితాల్ని చదివి కవితలను రాసి గానం చేసిన సుద్దాల హనుమంతు నిజాం భూస్వామ్య వ్యవస్థ కి వ్యతిరేకంగా పోరాడి జైలు శిక్ష అనుభవించిన కమ్యూనిస్టు అభిమాని అని వివ రించారు ఆయన రాసిన పల్లెటూరి పిల్ల గాడా పశువుల కాచే చిన వాడా పాట ప్రసిద్ధి పొందింది అని చెప్పారు యక్ష గానం పల్లె సుద్దులు రాసి పాడే వారు అని తెలిపారు గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన వేదిక పై వాహిని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ అకాడమీ డైరెక్టర్ శంకరమంచి లక్ష్మీ ప్రియ కథక్ కళా క్షేత్ర అంజి బాబు సంస్కృతిక అభిమాని ఏ వీ ఆర్ మూర్తి పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే గాంధీ ఏ పార్టీలో ఉన్నారో బహిరంగంగా చెప్పాలి : బిఆర్ఎస్



చందానగర్‌లో సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ నేతలు

శేరిలింగంపల్లి,డిసెంబర్ 18 ప్రభాతవార్త బీఆర్ఎస్ పార్టీ జెండాపై గెలిచిన శేరిలింగంపల్లి శాసన సభ్యులు అరికెపూడి గాంధీ ప్రస్తుతం ఏ పార్టీలో ఉన్నారో బహిరంగంగా ప్రజలకు చెప్పాలని శేరిలింగంపల్లి బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. చందానగర్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నేతలు బొబ్బ నవతారెడ్డి, సామ వెంకట్‌రెడ్డి, కలిదిండి రోజా, రవియాదవ్ మాట్లాడారు..శేరిలింగంపల్లి నియోజక వర్గ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ బీఆర్ఎస్ పార్టీలో ఉన్నారా లేక కాంగ్రెస్ పార్టీలో ఉన్నారా బహిరంగంగా చెప్పాలన్నారు. తెలంగాణ రాష్ట్ర స్పీకర్ ఇచ్చిన తీర్పు ప్రకారం ఎమ్మెల్యే గాంధీ బీఆర్ఎస్‌లో ఉంటే ఈనెల 21వ తేదిన కేసీఆర్ అధ్యక్షతన బీఆర్ఎస్ భవన్‌లో జరిగే రజతోత్సవ సమావేశానికి బీఆర్ఎస్ కండువా కప్పుకుని సమావేశానికి హాజరుకావాలని వారు డిమాండ్ చేశారు. అదే విధంగా శేరిలింగంపల్లి నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు బీఆర్ఎస్ కండువావేసుకుని రావాలన్నారు.నియోజకవర్గ అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌పార్టీలో చేరానని చెప్పుకున్న ఎమ్మెల్యే గాంధీ బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతున్నామని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు.కేవలం అవినీతి, అక్రమార్జనతో సంపాదించిన ఆస్థులను కాపాడుకునేందుకే గాంధీ పార్టీ మారటం జరిగిందన్నారు. అరికెపూడి గాంధీ కూడా తనపై వచ్చిన ఆరోపణలపై దమ్ముంటే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు, విజిలెన్స్‌కు లిఖిత పూర్వకంగా విచారణ కోరాలని బీఆర్ఎస్ నేతలు పట్టుబట్టారు. స్పీకర్ కోర్టు తీర్పు ఎమ్మెల్యే గాంధీకి అనుకూలంగా వచ్చినా రాబోయే ఎన్నికల్లో శేరిలింగంపల్లి ప్రజలు మాత్రం వ్యతిరేకంగా తీర్పు ఇచ్చి తగిన బుద్ధి చెబుతారన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే గాంధీ కాంగ్రెస్‌పార్టీలో చేరలేదని గుండెమీద చేయివేసుకుని ప్రజలకు సమాదానం చెప్పాలని లేనిపక్షంలో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి శేరిలింగంపల్లి ప్రజల తీర్పు కోరాలని బీఆర్ఎస్‌పార్టీ నేతలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు వాలా హరీశ్ రావు, సతీశ్‌రావు,శ్రీకాంత్‌యాదవ్,పారునంది శ్రీకాంత్, సంతోశ్‌రెడ్డి,మల్లారెడ్డి, సంగారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సుబ్బారాజు, సలీం,ప్రకాశ్,ప్రమోద్,వంశీ,అనంతరెడ్డి, శ్రీకాంత్ యాదవ్, నర్సింహారెడ్డి, మల్లేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

# దొరికిన గొలుసు...పోలీసుల ఔదార్యం

-బాధితురాలికి పోగొట్టుకున్న పుస్తెలతాడు అందజేత



బాధితురాలు గూండ హారికకు వెంకటరమణ చేతుల మీదుగా పుస్తెలతాడును అందజేస్తున్న జీడిమెట్ల సర్కిల్‌ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్ , సబ్‌ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ

కుత్బుల్లాపూర్, డిసెంబరు 18 ప్రభాతవార్త దారిలో వెళుతుండగా బంగారు పుస్తెలతాడు రోడ్డుపై పడి వుండటాన్ని గుర్తించిన ఓ వ్యక్తి దానికి జీడిమెట్ల పోలీసులకు అప్పగించారు. మూడురోజుల తరువాత తన పుస్తెలతాడు పోయిందని బాదితురాలు పోలీసులను ఆశ్రయించగా గుర్తులతో సరిపోల్చి ఆమె పోగొట్టుకున్న తన పుస్తెలతాడును నిజాయితీగా పోలీస్‌స్టేషన్‌లోనే అందజేసిన సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. జీడిమెట్ల సర్కిల్‌ఇన్‌స్పెక్టర్ గడ్డంమల్లేశ్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కుత్బుల్లాపూర్ గ్రామంలోని శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయ రోడ్డుపై ఈనెల15న సోమవారం కాలినడకన వెళుతున్న వెంకటరమణ అనేవ్యక్తికి రోడ్డుపై సుమారు ఐదు తులాల బంగారు పుస్తెలతాడు దొరికింది. దీనిని వెంటనే వెంకటరమణ జీడిమెట్ల పోలీసులకు సకాలంలో అందజేశాడు. పుస్తెలతాడు పోగొట్టుకున్న మహిళ గూండ హారిక తనగొలుసుపోయిందని శుక్రవారం పోలీసుస్టేషన్‌కు రావడంతో గొలుసు వివరాలను తెలుసుకుని తమకు వెంకటరమణ అందించిన గొలుసు వివరాలు సరిపోవడంతో స్వయంగా వెంకటరమణ చేతులమీదుదుగా బాదితురాలు గూండ హారికకు అందజేశారు. ఈసందర్భంగా తనకు గొలుసు దొరికినా నిజాయితీగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి అందజేసిన వెంకటరమణను సబ్‌ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, బాదితుల సమక్షంలో షాలువాలో సత్కరించి అభినందించారు. నిజాయితీగా దొరికిన వస్తువును పోలీసులకు అప్పగించిన వెంకటరమణ నిజాతీని అభినందిస్తూ ఉన్నతాధికారులకు కూడా సమాచారం అందించి అభినందించేలా చేస్తానని గడ్డం మల్లేశ్ తెలిపారు.

## ఏపి మహేష్‌బ్యాంక్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులకు రెండు నామినేషన్లు

హైదరాబాద్, డిసెంబరు 18,ప్రభాతవార్త: ఏ.పి మహేష్ అర్బన్ కోఆపరేటివ్‌బ్యాంక్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులకు నామినేషన్స్ స్వీకరించామని జిల్లా రెవెన్యూ అధికారి ఈ. వెంకటాచారి తెలిపారు. కలెక్టరేట్‌లోని మీని కాన్ఫరెన్స్ హాలో నిర్వహించిన ఎపి మహేష్ అర్బన్ కోఆపరేటివ్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులకు నామినేషన్స్ స్వీకరించడం జరిగిందని తెలిపారు. ఛైర్మన్ పదవికి మురళిమనోహర్ పలోడ్ నామినేషన్ ధాఖలు చేయగా , వైస్ ఛైర్మన్ పదవికి గోవింద్ నారాయన్ రాథి నామినేషన్ దాఖలు చేయనైనదని పేర్కొన్నారు. రెండు పదవులకు గాను రెండు నామిషన్లు వచ్చాయన్నారు. ఈ బోర్డులో మరో 12 మంది సభ్యులు ఉంటారని అలాగే మార్గదర్శకాలకు అనుగుణంగా ఛైర్మన్, వైస్ ఛైర్మన్ లను మిగతా సభ్యుల సమక్షంలో ఎన్నుకోవడం జరుగుతుందని తదుపరి అధికారికంగా ప్రకటిస్తామని డిఆర్ఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ జ్యోతి, డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ ఆఫీసర్ ప్రసన్న, లాఆఫీసర్ శ్రీధర్, అసిస్టెంట్ రిజిస్ట్రర్ పి. సుమలత, యండి. యాఖూబ్, బ్యాంక్ అధికారులు జి. అమర్‌నాథ్, పి. వేణుగోపాల్ , సిబ్బంది పాల్గొన్నారు.

### డిప్యూటీ ఐఓఎస్ నరేందర్ యాదవ్‌కు ఘన సన్మానం

చాంద్రాయణగుట్ట, డిసెంబర్ 18 ప్రభాతవార్త : పాతబస్తీ సైదాబాద్-1 జోన్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ (డిప్యూటీ ఐఓఎస్)గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నరేందర్ యాదవ్‌ను పిఆర్‌టియు నేతలు గురువారం ఘనంగా సన్మానించారు. పిఆర్‌టియు టిఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు తిరుపతిరెడ్డి, మండల శాఖ అధ్యక్షులు ఆంజనేశ్వరరావ్, ఉపాధ్యక్షులు మందడి వెంకట్‌రెడ్డి, ఆర్‌సి.సురేందర్, విజయలక్ష్మి, నవనీత, రఘువీర్‌రెడ్డి, ఉదయ్, సాంబశివరావ్, కొండల్‌రెడ్డి, రఘునందన్‌రావ్, తిరుపతిరావ్, సతీష్, హరిచంద్రు, జూనియర్ అసిస్టెంట్లు అఖిల్, నరేందర్, డేవిడ్, రతన్ తదితరులు శాలువ, పుష్పగుచ్ఛాలతో అభినందించారు. జోన్ పరిధిలో ఉన్న పాఠశాలలో మౌళిక వసతులు, విద్యాభివృద్దికి కృషి చేస్తానని నరేందర్ యాదవ్ అన్నారు.

### ముజాహిద్ హుస్సేనీని పరామర్శించిన బిసి కమిషన్ ఛైర్మన్



చార్మినార్,డిసెంబరు 18 ప్రభాతవార్త : పాతబస్తీకి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు సయ్యద్ షా ముజాహిద్ హుస్సేనీ సతీమణి అనారోగ్యంతో రెండు రోజుల క్రితం మరణించారు.ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర బిసి కమిషన్ ఛైర్మన్ జి.నిరంజన్ గురువారం పాతబస్తీ జహనుమాలోని ముజాహిద్ హుస్సేనీ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు జి.కన్నయ్యలాల్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

### పద్యనాటకాలు, కళాకారులను ప్రోత్సహించాలి



చిక్కడపల్లి డిసెంబర్ 18,ప్రభాతవార్త : అతిప్రాచీన కళారూపాలైన పద్యనాట కాలను, కళాకారులను ప్రోత్సహించాలని పూర్వ భూగర్భగనుల శాఖ డైరెక్టర్ డాక్టర్ విడి. రాజగోపాల్ అన్నారు. గురువారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో శివాని ఆర్ట్స్ అసోసియేషన్, గురు బాబా అర్చన ఆధ్వర్యంలో పౌరాణిక పద్యనాటకోత్సవాలు వైభవంగా ప్రారంభమైనాయి. ఈ సందర్భంగా మయసభ దుర్యోధనుడు, కృష్ణప్రభ పద్యనాటకం, రాయబారంలోని శీను ప్రదర్శనలు అద్భుతంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలిండియా వెలమ సంఘం ప్రధాన కార్యదర్శి కోట్ల వీణ, వనం కవిత, బీజేపీ నాయకురాలు దొంతి శిల్పారెడ్డి, నటుడు గూడ రామకృష్ణ, రంగస్థలనటుడు దేవనాధ సూరి, వ్యాపారవేత్త జిసి రెడ్డి, శివప్రసాద్, నెల్లుట్ల రవీందర్ రావు, నటకిరీటి బంగారు పెద్ద వెంకటయ్య, సినీనటుడు అరికట్ల వెంకటేష్, బీజేపీ నేత బొంత వెంకటరమణ, మన్నే సర్వేశ్వర్ రావు, మున్నంగి దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌కు చిత్రపురిలో ఘన సన్మానం



జూబ్లీహిల్స్ నూతన ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌ను సన్మానిస్తున్న చిత్రపురి కాలనీ మాజీ అధ్యక్షులు వల్లభనేని అనిల్ తదితరుల దృశ్యం

నార్సింగి, డిసెంబర్ 18 ప్రభాతవార్త : జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా భారీ విజయం సాధించిన నవీన్ యాదవ్‌ను చిత్రపురి కాలనీలో మాజీ అధ్యక్షులు వల్లభనేని అనిల్ టీం సభ్యులు భారీ గజమాలతో ఘనంగా సన్మానించారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌తో కలిసి నవీన్‌కు సత్కారం చేశారు. ఈ సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ యువకుడు, ఉత్సాహవంతుడు, పేదలకు సేవ చేయాలన్న తపన ఉన్న నవీన్ చిన్న వయసులోనే ఎమ్మెల్యేగా ఎంపికవ్వడం జూబ్లీహిల్స్ ప్రజలకు చాలా మేలు చేస్తుందన్నారు. దశాబ్దాల నుంచి జూబ్లీహిల్స్‌లో నవీన్ కుటుంబం పేదల పక్షా నిలబడి, వారి సమస్యలను పరిష్కరిస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి,కాంగ్రెస్ పార్టీ నవీన్ యాదవ్‌కు అవకాశం ఇవ్వడం, ఎన్నికల్లో సర్వశక్తులు ఒడ్డి ప్రజల ఆశీర్వాదంతో నవీన్ అసెంబ్లీలో అడుగు పెట్టడం ప్రజలకు మేలు చేస్తుందన్నారు. ప్రజల మధ్యన ఉన్న వారికి ప్రజా ప్రతినిధులుగా ఎదిగేందుకు సీఎం రేవంత్‌రెడ్డి అవకాశం ఇస్తున్నారని ప్రకాశ్‌గౌడ్ స్పష్టం చేశారు. అనంతరం చిత్రపురి కాలనీ మాజీ అధ్యక్షులు వల్లభనేని అనిల్ కుమార్ మాట్లాడుతూ నవీన్ యాదవ్ గెలుపులో చిత్రపురి కాలనీ సభ్యులు భాగస్వాములు కావడం మా అదృష్టమన్నారు. పిలిస్తే పలికే ఇలాంటి నేతలు చట్టసభల్లో ఉంటేనే ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్రపురి కాలనీ ప్రతినిధులు పిఎస్.దొర, హైమాంజలి, వెంకట్ యాదవ్, లలిత, రామకృష్ణప్రసాద్, అలహరి, రఘు, వేణుగోపాల్‌రావ్, రమేష్‌బాబు, అనితలతో పాటు వందలాది మంది చిత్రపురి కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

## పఠనయోగ్యమైన కథలు రచయిత హృదయవైశాల్యానికి తార్కాణం

-తెలంగాణ ఉదయసాహితి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు దాస్యం సేనాధిపతి



అనగనగా అమెరికా పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దాస్యంసేనాధిపతి, గీతామాధవి, కె.గీత, సుబ్బరాయశర్మ, నాళేశ్వరంశంకరం తదితర అతిథులు

రవీంద్రభారతి, డిసెంబరు 18 ప్రభాతవార్త : పఠనయోగ్యమైన కథలు వ్రాయడం సులభం కాదని సమాజానికి ఏదోక సందేశమివ్వగలిగినప్పుడే పాఠకులు ఆసక్తితో చదవడమేకాక రచయిత హృదయ వైశాల్యానికి తార్కాణంగా నిలుస్తుందని తెలంగాణ ఉదయసాహితి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు దాస్యం సేనాధిపతి అన్నారు. కాలిఫోర్నియా వీక్షణం ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో సంస్థ అధ్యక్షులు డా. గీతామాధవి సభాధ్యక్షతన జరిగిన వీక్షణం 160వ సాహితీ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన దాస్యం సేనాధిపతి విశిష్ట అతిథులు సుబ్బరాయశర్మ, వసీరా, నాళేశ్వరం శంకరం, కందుకూరి శ్రీరాములు, విశ్వైక, జి.రాజేంద్రప్రసాద్ తదితరులతో కలిసి డా. కె.గీత కాలమ్స్ పుస్తకం అనగనగా అమెరికా పుస్తకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. ఒక మొక్కవోని దీక్షతో 160వ సాహితీ సంచికతో సాహిత్యపరంగా సమాజానికి అంకితమవ్వడం విశేషమన్నారు. డా. గీతామాధవి ఆమె ఏదోఒక ప్రక్రియకు పరిమితం కాలేదని, ఆమె కథలు, కవిత్వం, నవలలు, గేయాలు వ్రాసారు, గానం చేశారు, లఘుచిత్రాలు తీసిన బహుముఖ ప్రజ్ఞాశాలి అన్నారు. అమెరికాలో ఉంటూ మనదేశ కవులు, రచయితలను ప్రోత్సహించడం గొప్పవిషయమన్నారు. ఈ కార్యక్రమాలతో సాహిత్య వికాసానికి తోడ్పడుతున్న డా. కె.గీతను హృదయపూర్వకంగా అభినందించారు. ఆమె జీవితచరిత్ర ఒక మహిళ ఎంతైనా సాధించగలదనడానికి నిదర్శనమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా నినుచేరని లేఖలు, గిజిగానిగూడు, సైన్స్ కథలు, కవితా సౌరభాలు, మట్టిచివురు పుస్తకాల ఆవిష్కరణ, ఆయా పుస్తకాల సమీక్షలు, చివరిగా డా. రాధా కుసుమ నిర్వహణలో కవిసమ్మేళనం జరిగాయి.

## 25న శివాజీనగర్ సంక్షేమ సంఘం ఎన్నికలు



శివాజీనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుని పోటీలో నామినేషన్ పత్రాన్ని ఎన్నికల అధికారికి అందజేస్తున్న విజయ్ గౌడ్.

యూసుఫ్‌గూడ, డిసెంబర్ 18, ప్రభాతవార్త : ప్రతి రెండు సంవత్సరాల కొకసారి జరిగే శివాజీనగర్ సంక్షేమ సంఘం ఎన్నికలు ఈనెల 25న నిర్వహించనున్నారు. ఇందుకుగాను గురువారం నామినేషన్లు స్వీకరించగా ప్రస్తుత అధ్యక్షుడు ఎస్ విజయ్ గౌడ్ తన నామినేషన్ పత్రాన్ని ఎన్నికల అధికారులకు అందజేశారు. ఈనెల 19న విత్‌డ్రాలు ఉంటాయని 23వ తేదీ వరకు ఎన్నికల ప్రచారం నిర్వహించుకోవచ్చని 25వ తేదీ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎన్నికలు నిర్వహించి అదేరోజు ఫలితాలను ప్రకటించటం జరుగుతుందని ఎన్నికల అధికారి పి.చంద్రశేఖర్, సహాయ అధికారి అభిలాష్‌లు పేర్కొన్నారు.

### క్రీడల పట్ల యువతకు మరింత ప్రోత్సాహం



బోరబండ కార్పొరేటర్ కార్యాలయంలో యువతకు క్రికెట్ కిట్లను పంపిణీ చేస్తున్న బోరబండ కార్పొరేటర్ మాజీ ఉప మేయర్ సతీమణి హబీబా సుల్తానా.

యూసుఫ్‌గూడ, డిసెంబర్ 18, ప్రభాతవార్త : యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు తగిన విధంగా కృషి చేయటం జరుగుతుందని మాజీ ఉప మేయర్ బాబా ఫసియుద్దీన్ సతీమణి, సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు హబీబా సుల్తానా అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని బోరబండ సైట్2 కార్పొరేటర్ కార్యాలయంలో యువతకు క్రికెట్ కిట్లను ఆమె పంపిణీ చేశారు.

### విద్యుత్ సమస్యలు కలగకుండా ఏర్పాట్లు : ఎస్ఈ శ్రీనివాస్



ఘాన్సీ బజార్ ఝూలాలో జరిగిన ప్రజాబాటలో పాల్గొన్న సౌత్ జోన్ ఎస్ఈ శ్రీనివాస్

చార్మినార్,డిసెంబరు 18 ప్రభాతవార్త : టిజిఎస్‌పిడిసిఎల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజాబాట కార్యక్రమంలో స్థానిక ప్రజల విద్యుత్ సమస్యలు పరిష్కారం అవుతున్నాయని టిజిఎస్‌పిడిసిఎల్ సౌత్ జోన్ ఎస్ఈ శ్రీనివాస్ అన్నారు.ఘాన్సీ బజార్ డివిజన్ పరిధి ఝూలా ప్రాంతంలో గురువారం జరిగిన ప్రజాబాటలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎస్ఈ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజాబాట కార్యక్రమంలో ప్రజలు నుంచి విద్యుత్‌సమస్యలపై వస్తున్న సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు.రానున్న వేసవి కాలంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండ అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలియజేశారు.ప్రజాబాట సందర్బంగా ఝూలా బస్తీలోని మూడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేయటంతో పాటు ఏబి కేబుళ్లు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో టిజిఎస్‌పిడిసిఎల్ చార్మినార్ డిఈ ఎం.శ్రీధర్, చార్మినార్ ఏడిఈ మహ్మద్ మక్సూద్,చార్మినార్ సిబిడి ఏడిఈ మహ్మద్ అక్బర్,చార్మినార్ ఏఈ మహ్మద్ అబ్దుల్ నసీర్,సబ్ ఇంజనీరు సతీష్,లైన్ ఇన్‌స్పెక్టర్ మంగారావు,ఫోర్‌మెన్ రామస్వామి,విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

### ప్రజా సమస్యలు నెరవేర్చడమే నా లక్ష్యం : బికే ఆర్

దుండిగల్, డిసెంబర్ 18, ప్రభాతవార్త కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గండి మైసమ్మ 120 చంద్రశేఖర్ రెడ్డి కాలనీలో బి.కె.ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఫౌండేషన్ అధ్యక్షులు బొంగునూరి కిషోర్ రెడ్డి హాజరై ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజలు ఉంటున్నటువంటి కాలనీలలో ఈ ఉచిత వైద్య సేవలు మరింత వేగవంతం చేయడం జరుగుతుందన్నారు. వైద్యంతో పాటు కాలనీలలో నెలకొన్నటువంటి సమస్యలను ప్రజలు తన దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వారికి హామీ ఇవ్వడం జరిగింది. అనంతరం మమత హాస్పిటల్ వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, పాల్గొన్నారు.

## రౌడీషీటర్లూ బుద్ధిగా మసులుకోండి : ఎసిపి సుధాకర్



రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఏసీపీ సుధాకర్

చాంద్రాయణగుట్ట, డిసెంబర్ 18 ప్రభాతవార్త : పాతబస్తీ బండ్లగూడ పోలీసు స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు గురువారం చాంద్రాయణగుట్ట డివిజన్ ఏసీపీ ఏ.సుధాకర్ కౌన్సిలింగ్ నిర్వహించారు. అనవసరమైన విషయాలలో తలదూర్చి నేర్పాలకు పాలనపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సత్‌ప్రవర్తనతో మెలిగి కుటుంబ సభ్యులతో సంతోషంగా ఉండాలన్నారు. నేరాలు చేసి జైలుకు వెళితే కుటుంబ సభ్యులు రోడ్డుపాలవుతఆరని హెచ్చరించారు. రౌడీషీటర్లపై నిరంతరం పోలీసులు నిఘా ఉంచుతారని ఏసీపీ సుధాకర్ స్పష్టం చేశారు.

### లైసెన్స్ లేకుండా శబ్దాలు.. పబ్‌పై కేసు నమోదు

జూబ్లీహిల్స్, డిసెంబరు 18, ప్రభాతవార్తః ఎలాంటి లైసెన్స్ లేకుండా పెద్ద శబ్దంతో సంగీతాన్ని ఏర్పాటు చేసిన బోర్బన్ అండ్ బ్రీజ్ పబ్‌పై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. బుధవారం రాత్రి బంజారాహిల్స్ రోడ్ నంబరు 14లోని కేబీఆర్ ఉద్యానవనం సమీపంలో ఉన్న బోర్బన్ అండ్ బ్రీజ్ పబ్ నుంచి పెద్దఎత్తున శబ్దాలు వస్తున్నట్లు రాత్రి 10.30గంటల ప్రాంతంలో పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలోనే పోలీసులు పబ్‌లోకి వెళ్లి పరిశీలించగా ఎలాంటి వినోద లైసెన్స్ లేకుండా పెద్దశబ్ధంతో సంగీతాన్ని అక్కడ ప్లే చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు పబ్ లైసెన్స్ దారు విద్యానంద మూర్తి, యజమాని ధర్మారెడ్డి, మేనేజర్ ఉత్తమ్‌కుమార్‌తోపాటు పలువురిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జుట్టు చికిత్సకు వెళ్లితే కొత్త సమస్యలు

బంజారాహిల్స్‌లో పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

జూబ్లీహిల్స్, డిసెంబరు 18, ప్రభాతవార్తః జుట్టు సమస్య ఉందని చికిత్సకు వెళితే కొత్త అనారోగ్య సమస్యలు వచ్చాయని ఒక వ్యక్తి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం. . హఫీజ్ బాబా నగర్ ప్రాంతంలో నివసించే అఫ్జల్ తౌఫిక్ అహ్మద్(45) గత కొద్ది కాలంగా జుట్టు రాలే సమస్యను ఎదుర్కొంటున్నారు. దీంతో స్నేహితుల సూచన మేరకు బంజారాహిల్స్ రోడ్ నంబరు 14లోని ర్యాన్ క్లీనిక్‌ను సంప్రదించారు. తాము దేశంలోనే ఉత్తమ టర్కీ హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేస్తామని సూచించారు. అది నమ్మిన అతను ఈ నెల 15న మధ్యాహ్నం 1 గంట ప్రాంతంలో ర్యాన్ క్లీనిక్‌కు వెళ్లాడు. క్లీనిక్‌లో ఆనమ్ అనే మహిళ సూచన మేరకు ప్రవీణ్ అనే ల్యాబ్ టెక్నీషియన్ పీఆర్పీ చికిత్సను ప్రారంభించారు. చికిత్స జరిగిన వెంటనే తలతిరగడం ప్రారంభం కావడంతో అదే విషయాన్ని క్లీనిక్ నిర్వాహకులకు తెలియజేయగా ఏమి కాదంటూ ఇంటికి పంపారు. కాగా అప్పటి నుంచి అతనికి నిరంతరం తల తిరగడం, వాంతులు, ఎడమ చేతి వైపు మొద్దుబారడం ప్రారంభమైంది. ఈ సంఘటనతో కంగుతిన్న ఆయన బుధవారం రాత్రి బంజారాహిల్స్ పోలీసులను సంప్రదించాడు. నకిలీ వైద్యుడు, క్లీనిక్ సిబ్బంది నిర్లక్ష్యం వల్ల తాను తీవ్రమైన ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నాని, వారి పై చర్యలు తీసుకోవాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ఈవెంట్ ప్లానర్ మోసం.. పోలీసులకు ఫిర్యాదు

జూబ్లీహిల్స్, డిసెంబరు 18, ప్రభాతవార్తః పెళ్లి కార్యక్రమం నిర్వహణ పేరుతో ఈవెంట్ ప్లానర్ భారీ మొత్తాన్ని తీసుకుని మోసం చేసిన ఘటనపై బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. బీహార్‌లోని పట్నాకు చెందిన ఆనంద్ రాజ్ (29) తన భాగస్వామి మైత్రితాతో కలిసి హైదరాబాద్‌లో నివసిస్తూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. తమ పెళ్లి కార్యక్రమాలను నిర్వహించేందుకు చెక్‌లిస్ట్ ఈవెంట్స్ ద్వారా ఆన్‌లైన్‌లో సంప్రదింపుల ద్వారా సందీప్ చక్రవర్తిని ఈవెంట్ ప్లానర్‌గా నియమించుకున్నారు. సెప్టెంబర్ 8న బంజారాహిల్స్‌లోని జీవీకే ఛాంబర్స్‌లో ఉన్న కేఫ్ కాఫీ డేలో సమావేశమై, డిసెంబర్ 3, 4, 5 తేదీలకు జార్‌గోల్డ్ లగ్జరీ ఫామ్ రిసార్ట్‌లో వేడుకలు నిర్వహించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇందులో భాగంగా పలు దఫాల్లో రూ.16.85 లక్షలను వేడుకల నిర్వాహకులకు చెల్లించారు. డిసెంబర్ 2న ఈవెంట్ ప్లానర్ వాట్సాప్ ద్వారా కార్యక్రమం నిర్వహించలేమని తేల్చిచెప్పారు. సందీప్ చక్రవర్తి, సుజాత గంగూలీ ఇద్దరు కలిసి తమను మోసం చేశారంటూ ఆయన బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రానున్న కాలంలో ఉద్యమకారులకు ప్రాధాన్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రదీప్ కుమార్

**హయత్ నగర్ డిసెంబర్ 18 ప్రభాతవార్త :** బీఆర్ఎస్ పార్టీ పెద్దలతో మాట్లాడి ఉద్యమకారుల ఆకాంక్షలు నెరవేర్చడానికి పూర్తి బాధ్యత తీసుకుంటానని మలిదశ ఉద్యమ కారుడు గోరిగె ప్రదీప్ కుమార్ అన్నారు. హయత్ నగర్ డివిజన్ మలి దశ తెలంగాణ బంకెట్ హాలులో గురువారం నిర్వహించిన మలి దశ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... రాబోయే కాలంలో ఉద్యమకారులకు బీఆర్ఎస్ పార్టీ పూర్తి అండగా ఉంటుందన్నారు. రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికలో పార్టీ తరపున కార్పొరేటర్ టికెట్ ఉద్యమ కారులకు ఇవ్వాలని పార్టీ అధిష్టానాన్ని విన్నవించినట్లు తెలిపారు. పార్టీ పెద్దలు కూడా సుము కతను వ్యక్తం చేసారని... ఉద్యమ కారులంతా ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల పక్షాన పోరాడాలని సూచించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించి వారిని చైతన్య పరచాలని కోరారు. కార్యక్ర మంలో కాటేపాక స్కైలాబ్, వస్పరి బలరాం, దేగల రాకేష్, గోపాల్, వరలక్ష్మీ, అరుపుల దేవి ప్రసాద్, దూబాక సురేష్, రాజు నాయక్ పాల్గొన్నారు.

## యువత మార్షల్ ఆర్ట్స్‌పై ఆసక్తి పెంపొందించుకోవాలి

-కోచ్ ఆదిమూల కృష్ణ




విజేతలకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేస్తున్న కోచ్ ఆదిమూల కృష్ణ తదితరులు

**మలక్ పేట డిసెంబర్ 18, ప్రభాతవార్త:** యువత మార్షల్ ఆర్ట్స్ పై ఆసక్తి పెంపొందించుకోవాలని రా కంబాట్ స్పోర్ట్స్ అకాడమీ కోచ్ ఆదిమూల కృష్ణ పేర్కొన్నారు. మహవీర్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన 6వ తెలంగాణ రాష్ట్ర గ్రాప్ లింగ్ ఛాంపియన్షిప్ 2025 పోటీలలో చెందిన రా కంబాట్ స్పోర్ట్స్ అకాడమీకి చెందిన విద్యార్థులు పోటీలలో పాల్గొని బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచారు. తెలంగాణ రాష్ట్ర గ్రాప్ లింగ్ ఛాంపియన్షిప్ 2025 పోటీలలో బంగారు, రజిత, కాంస్య పతకాలను సాధించిన విద్యార్థులను కోచ్ ఆదిమూల కృష్ణ తదితరులు ఘనంగా సన్మానించి సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రాప్ లింగ్ క్రీడలపై ఆసక్తి పెరుగుతోందని పేర్కొన్నారు. మార్షల్ ఆర్ట్స్ లో గ్రాప్ లింగ్ క్రీడలను నూతనంగా ప్రవేశపెట్టారని, గ్రాప్ లింగ్ క్రీడలు ఒక రకమైన కుస్తీ పోటీ మాదిరిగా ఉంటుందని వివరించారు. గ్రాప్ లింగ్ పోటీలలో వినయ్, ప్రణయ్, ముసబ్, విశాల్, ఈశ్వర్, కేశవ్, అజయ్ లు బంగారు పతకాలను సాధించగా, తరుణ్ రజత పతకాం, అశోక్ కాంస్య పతకాలను సాధించారని వివరించారు. ఆత్మ రక్షణ కోసం మార్షల్ ఆర్ట్స్ ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## దేవాలయం అభివృద్ధికి కృషి : చైర్మన్ బాబు శ్రీనివాస్



అమ్మవారికి సమర్పించిన చీరలను భక్తులకు పంపిణీ చేస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ బాబు శ్రీనివాస్, చౌకి రవికుమార్ తదితరులు

**మలక్ పేట డిసెంబర్ 18, ప్రభాతవార్త:** మలక్ పేటలోని శ్రీ పోచమ్మ దేవాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నామని దేవాలయం కమిటీ చైర్మన్ బాబు శ్రీనివాస్ పేర్కొన్నారు. దేవాలయంలో అమ్మవారికి సమర్పించిన చీరలను దేవాలయం వద్ద ఆలయ కమిటీ చైర్మన్ బాబు శ్రీనివాస్, కమిటీ సభ్యులు చౌకి రవి కుమార్, శ్రీనివాస్ గుప్తా, సునీత తదితరులు భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దేవాలయం చైర్మన్ బాబు శ్రీనివాస్ మాట్లాడుతూ దేవాలయానికి విచ్చేసే భక్తులకు మెరుగైన సౌకర్యాలను కల్పించడానికి చర్యలు చేపడుతున్నామని వివరించారు. కార్యక్రమంలో నాయకులు తాటికొండ శ్యామ్, బుర్ర బాలరాజ్ పాల్గొన్నారు.

## సమస్యలను పరిష్కరించాలి



కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డికి వినతి పత్రాన్ని అందజేస్తున్న స్థానికులు

**నాచారం, డిసెంబర్ 18 ప్రభాతవార్త :** మల్లాపూర్ డివిజన్ పరిధిలోని చండియా నగర్ కాలనీ వాసులు మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డిని మల్లాపూర్ వార్డ్ కార్యాలయంలో కలిసి కాలనీలో సీసీ రోడ్ల అభివృద్ధి పనుల కొరకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు కంది రాములు, కటమయ్యా గౌడ్, సత్యనారాయణ, బిరయ్య, సీతాల వీరస్వామి తదితరులు పాల్గొన్నారు

## మహిళల అభ్యున్నతి కోసం కృషి : ఎమ్మెల్యే బలాల



మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బలాల, చిత్రంలో కార్పొరేటర్ మినాజుద్దీన్ తదితరులు

**మలక్ పేట, డిసెంబర్ 18, ప్రభాతవార్త:** మహిళల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నామని మలక్ పేట నియోజకవర్గం ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ సంస్థ నుంచి మంజూరైన కుట్టు మిషన్లను ఎమ్మెల్యే బలాల లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా బలోపేతం అవ్వాలని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మినాజుద్దీన్, పలువురు మహిళలు పాల్గొన్నారు

# నేరేడ్‌మేట్ మీసేవలో అస్తవ్యస్త సేవలు..

-చిన్నారులతో వచ్చిన దరఖాస్తుదారులకు నరకయాతన

-అవినీతి ఆరోపణలో నేరేడ్‌మెట్ మీ సేవ కేంద్రం





**నేరేడ్ మెట్, డిసెంబర్ 18,ప్రభాతవార్త :** మల్కాజ్‌గిరి మండలంలోని నేరేడ్ మెట్ ప్రాంతంలో ఉన్న మీసేవ కేంద్రం దరఖాస్తుదారులకు తీవ్ర ఇబ్బందులకు కేంద్రమైందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సిబ్బంది నిరక్ష్య ధోరణి, అహంకారపూరిత ప్రవర్తనతో ప్రజలు విసుగు చెందుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

**చిన్నారులకు ప్రత్యేక కౌంటర్ లేక అవస్థలు**

0-5 సంవత్సరాల చిన్నారులకు ఆధార్ నమోదు సమయంలో కంటి ఐరిస్ అవసరం లేకపోయినా, 18 నెలల చిన్నారికి కూడా ఐరిస్ తప్పనిసరి అంటూ సిబ్బంది గంటల తరబడి కాలయాపన చేయించారని బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. చిన్నారులతో వచ్చిన తల్లిదండ్రులు తీవ్ర మానసిక, శారీరక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

**మానసిక వ్యథ కు గురైన దేవినగర్ వాసి జయశ్రీ**

గురువారం తన 18 నెలల కూతురు కు ఆధార్ కార్డు చేసుకుందామని నేరేడ్మెట్ మూడుగుళ్ల ప్రాంతంలో ఉన్న మీసేవ కేంద్రానికి వచ్చి క్యూ లైన్ రెండు గంటలు వెయిట్ చేసి తీరా కౌంటర్ దగ్గకు వెళ్లే సరికి లంచ్ టైం ఐనది అంటూ వెళ్ళింది. తన పాపా పాలు లేక ఇబ్బంది పడుతుంది అమ్మ రెండు నిముషాలు టైం కేటాయించి ఆధార్ పూర్తి చేసి వెళ్ళండి మేడం అంటూ బతిలాడిన నీకోసం లంచ్ చేయకుండా పని చేయాలా అంటూ అహంకార పూరిత మాటలో లంచ్ కి వెళ్లి పోయింది. అదే సమయములో అల్టర్నేట్ సిబ్బందిని పెట్టకుండా అక్కడ ఉన్న సూపర్ వైసర్ కూడా మిన్నకుండా పోయాడు. అప్పటి వరకు వెయిట్ చేసిన ఆ తల్లి కూతురు అమ్మ గారు ఇప్పుడైనా నెమ్మది గా ఆధార్ చేస్తారేమో అనుకుంటే కంప్యూటర్ టెక్నికల్ తెలుగుతో ఆ 18 నెలల చిన్నారిని ఐరిస్ పేరుతో మరింత కాలయాపన చేసి ఆ తల్లి పిల్లలను తీవ్ర ఇబ్బందులకు గురి చేసింది అని ఆమె పేర్కొన్నారు.

**ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో" అనే సమాధానం**

సిబ్బంది వైఖరిపై ప్రశ్నించిన దరఖాస్తుదారులకు ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో" అంటూ నిరక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ప్రజాసేవ చేయాల్సిన మీసేవ కేంద్రంలో బాధ్యతారాహిత్యం స్పష్టంగా కనిపిస్తోందని స్థానికులు మండిపడుతున్నారు.

**లంచ్ టైం పేరుతో గంటల తరబడి ఆలస్యం**

గంటల కొద్దీ లైన్లో నిలబడి చివరకు కంప్యూటర్ దగ్గరకు రాగానే లంచ్ టైం అంటూ సిబ్బంది వెళ్లిపోతున్నారని, తిరిగి రావడానికి మరో గంటల సమయం పడుతోందని దరఖాస్తుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిన్నపిల్లలతో వచ్చిన తల్లిదండ్రులు అత్యంత ఇబ్బందులు పడుతున్న పరిస్థితి నెలకొంది.

**టెక్నికల్ సమస్యల పేరిట కాలయాపన......**

టెక్నికల్ వర్క్ ఉందంటూ కావాలనే దరఖాస్తుదారులను తిరగేస్తున్నారని, సమస్యలు పరిష్కరించకుండా చుక్కలు చూపిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఆధార్ వంటి అత్యవసర సేవల కోసం వచ్చిన ప్రజలు ఫలితం లేకుండా వెనుదిరగాల్సి వస్తోంది.

**సూపర్వైజర్ శ్రీనివాస్ పై అవినీతి ఆరోపణలు.....**

మీసేవలో సూపర్వైజర్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్‌పై అవినీతి ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. సిబ్బంది అహంకారపూరిత సమాధానాలు, వెటకారపు మాటలతో దరఖాస్తుదారులను మనస్థాపానికి గురి చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**అధికారులు చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు**

నిత్యం వేలాదిమంది వచ్చే మూడుగుడుల ప్రాంతం లో మీ సేవ కేంద్రం ఒక్కటే ఉండటంతో రద్దీ ఎక్కువగా మారిందని, అయినా సరైన సిబ్బంది నియామకం, క్రమశిక్షణ లేకపోవడం వల్ల గొడవల వాతావరణం నెలకొంటోందని ప్రజలు అంటున్నారు.ఈ పరిస్థితిపై జిల్లా అధికారులు, డిసిఓ వెంటనే స్పందించి మీసేవ నిర్వాహకులు, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో మీసేవ కేంద్రం వద్ద పెద్ద ఎత్తున ధర్నాలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.

## అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే బీఎల్ఆర్



నాచారం డివిజన్‌లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపనలు చేసిన ఎమ్మెల్యే బీఎల్ఆర్

**నాచారం, డిసెంబర్ 18 ప్రభాతవార్త :** నాచారం డివిజన్‌లో రూ. 71 లక్షల రూపాయల సిమెంటు రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్‌తో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. నాచారం డివిజన్ భవానినగర్ లో రూ. 40 లక్షల రూపాయలతో నూతన సిమెంటు రోడ్డు నిర్మాణానికి అలాగే నాచారం ఓల్డ్ విలేజ్‌లో రూ. 8 లక్షల రూపాయలతో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులకు ఎర్రకుంటలోని ఎల్బీఎస్ కమ్యూనిటీ హాల్ రోడ్డులో రూ. 23 లక్షల రూపాయలతో నూతన సిమెంట్ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తో కలిసి నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ తో కలిసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేవలం రెండు నెలల కాలంలోనే నాచారం డివిజన్‌కు సుమారు రూ. 9 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. అలాగే నాచారం రైతు బజార్ పక్కన ఉన్న ప్రభుత్వ స్థలంలో నాచారం డివిజన్లోని పేద మధ్యతరగతి ప్రజలు చిన్నచిన్న శుభకార్యాలు చేసుకోవడానికి వీలుండేలా మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌ను తొందర్లోనే నిర్మించనున్నామని తెలియజేశారు. మంజూరైన పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులకు సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇంజనీర్ బాలకృష్ణ,అసిస్టెంట్ ఇంజనీర్ వినీత్, వర్క్ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్, నాచారం డివిజన్ బారాస నాయకులు కార్యకర్తలు భవాని నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు నాచారం ఓల్డ్ విలేజ్ గ్రామ పెద్దలు అలాగే నాచారం సీనియర్ సిటిజన్స్ మరియు ఎర్రకుంట బస్తీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బోడుప్పల్ సీమాప్‌లో అవగాహన సదస్సు




బోడుప్పల్ సీమాప్‌లో అధ్యాపకులకు , విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కిరణ్ బాబు

**బోడుప్పల్, డిసెంబర్ 18 ప్రభాతవార్త :** సీ.ఎస్.ఐ.ఆర్ కేంద్రీయ ఔషధ , సుగంధ మొక్కల పరిశోధన కేంద్రము (సీమాప్), బోడుప్పల్ విజన్ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ నుండి వచ్చిన 80 మంది బి ఫార్మసి గ్రాడ్యుయేట్ విద్యార్థులకు , అధ్యాపకులకు ఔషధ మొక్కలపై ఒక రోజు అవగాహన సదస్సు నిర్వహించబడిందని ఆ సంస్థ ముఖ్య శాస్త్రవేత్త ఇంజనీర్ జి.డి. కిరణ్ బాబు తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో వాణిజ్యపరంగా ముఖ్యమైన సుగంధ , ఔషధ మొక్కల సాగు, ప్రాథమిక ప్రాసెసింగ్, విలువ జోడింపు, నాణ్యత , మార్కెటింగ్ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సుగంధ పంటలనుండి సుగంధ నూనెలు ఔషధ మొక్కల నుండి క్రియాశీల ఔషధాలు తయారీ విధానాన్ని ఆచరణాత్మకంగా ప్రదర్శించి వాటి నాణ్యత, విలువజోడింపు , మందులలో ఉపయోగించే విధానం విద్యార్థులకు వివరించారు. ఇలాంటి నైపుణ్యాభివృద్ధి శిక్షణలు ప్రొఫెషనల్ కోర్స్ చదివే విద్యార్థులకు చాలా అవసరమని వీటి వలన భారతీయ ఫార్మా రంగంలో మంచి అవకాశాలు లభిస్తాయిని ఆయన తెలిపారు. సీమాప్ లో జరుగుతున్న పరిశోధన ,అభివృద్ధి కార్యకలాపాలను విద్యార్థులకు ఆచరణాత్మకంగా పరిచయం చేయడమే ఈ సందర్శన లక్ష్యమని, ఇటువంటి అనుభవం విద్యార్థుల విద్యా అభ్యాసం యొక్క ఆచరణాత్మక అనువర్తనాలపై, ముఖ్యంగా ఔషధ మరియు సుగంధ మొక్కల పరిశోధన, విశ్లేషణాత్మక పద్ధతులు , సంస్థాగత శాస్త్రీయ పద్ధతులపై వారి అవగాహనను పెంపొందించుటకు దోహదపడుతుందని కిరణ్ బాబు అన్నారు.

## విజయ హైస్కూల్లో విద్యార్థులకు షిటీమ్ అవగాహన సదస్సు



విజయ హై స్కూల్లో పాల్గొన నిర్వహిస్తున్న షీ టీమ్ బృందం.

**కుషాయిగూడ,డిసెంబర్ 18,ప్రభాతవార్త** విజయ హైస్కూల్ కాప్రా, పాఠశాల ఆవరణలో షీటీం నేతృత్వంలో విద్యార్థులకు సైబర్‌క్రైమ్, చైల్డ్ హెరాస్మెంట్, డ్రగ్స్, రోడ్ సేఫ్టీ, ఆన్లైన్ గేమింగ్, సోషల్ మీడియాలో జరిగే మోసాలు, వాట్సప్ చాటింగ్, ప్రతిరోజూ ఎదురయ్యే సమస్యలను ఎలా ఎదుర్కోవాలో అనే మొదలైన అంశాల భద్రతా చర్యలపై ఎలా దృష్టి సారించాలో ఒక అద్భుతమైన అవగాహన సదస్సు ను మొబైల్ వీడియో షోను కుషాయిగూడ డివిజన్‌కు చెందిన షీటీమ్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ హబీబ్ ఇన్‌చార్జ్ శ్రీమతి నళిని హాజరై ఈ కార్యక్రమాన్ని విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఆన్‌లైన్ భద్రత, స్వీయ అవగాహన మరియు అనుమానాస్పద కార్యకలాపాలను నివేదించడం యొక్క ప్రాముఖ్యత కోసం అవసరమైన వ్యూహాలను 6 నుండి 10వ తరగతుల విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. డిజిటల్ ప్రపంచాన్ని సురక్షితంగా నావిగేట్ చేయడానికి ప్రతి ఒక్కరికీ విలువైన జ్ఞానాన్ని సమకూర్చి, విద్యార్థులకు మరియు ఉపాధ్యాయులకు సైబర్ నేరాల పట్ల ఎలా మెలగాలో వాటిని ఎలా అదుపు చేయాలో తెలియజేశారు.సురక్షితమైన సమాజాన్ని నిర్మించడంలో అంకితభావం కలిగి సురక్షితమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని పొందడం కోసం మెరుగైన అవగాహనను అందించినందుకు పాఠశాల కరెస్పాండెంట్ షీటీంకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసారు.సురక్షితమైన మరియు సహాయక వాతావరణాన్ని పెంపొందించడాన్ని కొనసాగిద్దాం.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ వీణ ,ప్రిన్సిపల్ దేవినేని వెంగబాబుగారు మరియు ఉపాధ్యాయుల బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

## డిసిసి ఆధ్వర్యంలో శంషాబాద్ ధర్నాకు తరలిన కాంగ్రెస్ నేతలు



ధర్నా కార్యక్రమంలో ప్రసంగస్తున్న బడంగ్‌పేట్ మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి: చిత్రంలో డిసిసి అధ్యక్షుడు, టియుఎఫ్ఐడిసి ఛైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, రోడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి తదితరులు

**సరూర్‌నగర్, డిసెంబర్ 18 ప్రభాతవార్త:** నేషనల్ హెరాల్డ్ కేసు ద్వారా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడడాన్ని నిరసిస్తూ ఎఐసిసి, టిపిసిసి పిలుపు మేరకు రంగారెడ్డి జిల్లాలోని శంషాబాద్ కేంద్రంలో డిసిసి అధ్యక్షుడు, టియుఎఫ్ఐడిసి ఛైర్మన్ చల్లా నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో తలపెట్టిన ధర్నా కార్యక్రమానికి మహేశ్వరం నియోజకవర్గంలోని జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్ నుండి మాజీ మేయర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి తదితరులు తరలివెళ్ళారు. ఈ సందర్భంగా ఆమె అక్కడ షాద్‌నగర్ ఎమ్మెల్యే ఈర్లపల్లి శంకర్, రాష్ట్ర రోడ్ల డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, రంగారెడ్డి జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ డాక్టర్ తీగల అనితా హరినాథ్‌రెడ్డి, ముదిరాజ్ కార్పొరేషన్ ఛైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌లతో పాటు పలువురు ముఖ్య నేతలు తదితరులతో కలిసి ఆమె నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎటువంటి ఆధారాలు లేని కేసుతో కాలయాపన చేయిస్తూ ప్రజల నుండి కాంగ్రెస్ పార్టీని దూరం చేసే కుట్ర చేస్తున్నదని విమర్శించారు. నేషనల్ హెరాల్డ్ కేసు విషయంలో కోర్టు ఇచ్చిన తీర్పు బిజెపికి చెంప దెబ్బలాంటిదని ఆమె అన్నారు.

## రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి పర్యటన

-రామోజీ ఫిల్మ్ సిటీ నోఫ్లై జోన్

**నేరేడ్‌మెట్, డిసెంబర్ 19,ప్రభాతవార్త :** భారత రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి నేడు, రేపు (డిసెంబర్ 19, 20) రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్మెట్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీని సందర్శించనున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేశారు. ఈ సందర్భంగా రాచకొండ కమిషనరేట్ పరిధిలోని నోటిఫైడ్ ప్రాంతాలను సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ కింద నోఫ్లై, నోడ్రోన్ జోన్‌గా ప్రకటించారు.ఈ నోటిఫికేషన్ ప్రకారం డ్రోన్లు, యూఏవీలు, రిమోట్ పైలట్ విమాన వ్యవస్థలు, పారాగ్లైడర్లు, బెలూన్లు, మైక్రోలైట్ విమానాలు తదితర ఎగిరే వైమానిక వస్తువులను ఎగరవేయడం నిషేధించబడిందని రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు ఐపీఎస్ తెలిపారు. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## ఎమ్మెల్యే ఏ పార్టీలో ఉన్నారో స్పష్టం చేయాలి

-నియోజకవర్గం అభివృద్ధిని పట్టించుకోవడం లేదు

-మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బిజెపి అధ్యక్షుడు సూరెడ్డి వినయ్ రెడ్డి

**అత్తాపూర్ డిసెంబరు18,ప్రభాతవార్త :** ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఏ పార్టీలో ఉన్నారో ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని మైలార్‌దేవ్ పల్లి డివిజన్ బిజెపి అధ్యక్షుడు సూరెడ్డి వినయ్ రెడ్డి పేర్కొన్నారు . గురువారం సూరెడ్డి వినయ్ రెడ్డి ప్రభాతవార్తతో మాట్లాడుతూ.... నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌ని తమ ఎమ్మెల్యే అని చెప్పుకోలేని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. కాంగ్రెస్ కార్యక్రమాల్లో తిరుగుతూ, కాంగ్రెస్ ఫ్లెక్సీల్లో కనిపిస్తూ, నేను బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేనని చెప్పుకోవడం ప్రజలను అగౌరవ పరచడమేనన్నారు. ఏళ్ల తరబడి రాజేంద్రనగర్‌లో అభివృద్ధి అనే మాటే కనిపించడం లేదని రోడ్లు, డ్రైనేజ్, మౌలిక సదుపాయాలు పట్టించుకోకుండా షాప్ ఓపెనింగ్స్, పెళ్లిళ్లు, ఫంక్షన్లు అటెండ్ కావడమే మీ రాజకీయమా? ప్రజల సమస్యలపై ఆసక్తి లేదా ?ప్రజలకు నిజాయితీ, బాధ్యత, అభివృద్ధి కావాలన్నారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కాంగ్రెస్ పార్టీలో ఉన్నామని చెప్పుకుంటున్న ఐదుగురు ఎమ్మెల్యాలకు ఎలాంటి ఆధారాలు లేవు అని స్పష్టం చేశారని ఉప్పటికైనా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఏ పార్టీలో ఉన్నారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు.

## 22న ఓయూలో జాబ్ మేళా

: డిప్యూటి చీఫ్ అధికారి రాములు

**తార్నాక, డిసెంబర్ 18 ప్రభాతవార్త :** ఉస్మానియా యూనివర్సిటీల ఆర్ట్స్ కాలేజి ఎదురుగా నున్న ఎంప్లాయిమెంట్ బ్యూరో ఆవరణలో ఈ నెల 22వ తేదీన నిర్వహిస్తున్న జాబ్ మేళాకు అర్హత గల యువతి, యువకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్, గైడెన్స్ బ్యూరో చీఫ్ అధికారి టి. రాములు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో మెడ్‌ప్లస్ గ్రూప్ కంపెనీ పాల్గొంటుందని, ఫార్మసిస్ట్ , అసిస్టెంట్ లోని రెండు విభాగాల్లో దాదాపు 200 పోస్టులు భర్తీ చేయుటకుగాను డి.బి.యం. ఫార్మసీ లేదా ఏదేని డిగ్రీ అర్హత కలిగి ఉండి, 18 సంవత్సరాలు నుండి 30 సంవత్సరాల లోపు వయస్సు కలిగి ఉండాలని ఆయన అన్నారు. అర్హత, ఆసక్తి గల నిరుద్యోగ యువతి , యువకులు పూర్తి బయోడేటా లో పాటు విద్యార్హతల జిరాక్స్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని తెలిపారు.ఈ 22వ తేదీన ఉదయం11.00 గంటల జరిగే జాబ్ మేళాకు అర్హత గల యువతి, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని, సద్వినియోగం చేసుకోవాలన్నారు, మరిన్ని వివరాలకు 9666662481 ఫోన్ నెంబర్‌ను సంప్రదించగలని ఆయన కోరారు.



బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పరిధిలోని హైదర్షాకోట్‌లో జరిగిన అయ్యప్ప స్వామి మహాపడి పూజలో పాల్గొన్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ దృశ్యం.

## డబుల్ బెడ్రూమ్ ఇళ్ల వివాదంలో మాజీ కార్పొరేటర్‌పై కేసు నమోదు

**మేడిపల్లి డిసెంబర్ 18 ప్రభాతవార్త:** పీర్జాదిగూడ సర్కిల్ పర్వతాపూర్ డబుల్ బెడ్రూమ్ వివాదంలో మేడిపల్లి మండలం తహసీల్దార్ ఫిర్యాదు మేరకు మాజీ కార్పొరేటర్ భర్తపై మేడిపల్లి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...పర్వతాపూర్ డబుల్ బెడ్రూమ్ లో బీ/117/2021 ప్లాంట్లను ప్రభుత్వం ఎండీ హసన్ పక్రుద్దీన్ కేటాయించింది. అయితే అందులో శారద అనే మహిళ కుటుంబం ఆక్రమించారని బాధితుడు గతంలో అధికారులకు పిర్యాదు చేశాడు. దీంతో రెవెన్యూ సిబ్బంది ఈనెల 1 వ తేదీ ఆక్రమణ దారుల్ని ఖాళీ చేయించి సీజ్ చేశారు.డబుల్ బెడ్రూమ్ వద్దకు వెళ్లిన అధికారులను శారద అనే మహిళ గ్యాస్ లీక్చేసి ఆత్మహత్య చేసు కుంటానని బెదిరించింది.దీనికి తోడు ఆక్రమదారులకు మాజీ కార్పొరేటర్ భర్త మహేష్ సహకారం అందిస్తున్నాడని, విధుల్లో ఉన్న ప్రభుత్వ సిబ్బందికి ఆటంకం కలిగించారన్న అభియోగంతో మేడిపల్లి తహసీల్దార్ డీవిఎస్ఎస్ కృష్ణచైతన్య ఈనెల 15వ తేదీన మేడిపల్లి పోలీసులకు పిర్యాదు చేశారు. ఈ మేరకు పలు సెక్షన్లపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మేడిపల్లి పోలీసులు తెలిపారు.

## కోర్టుకు బాంబు బెదిరింపు...



మేడ్చల్ కోర్టును తనిఖీ చేస్తున్న బాంబు స్క్వాడ్, కుషాయిగూడ పోలీసులు...

**కుషాయిగూడ, డిసెంబర్ 18, ప్రభాతవార్త.** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కోర్టుకు బాంబు బెదిరింపు రావడంతో కుషాయిగూడ పోలీసులు రంగంలోకి దిగారు. కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని కుషాయిగూడ ప్రాంతంలోని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కోర్టు లో బాంబు ఉన్నట్లు గుర్తు తెలియని వ్యక్తులు సమాచారం ఇవ్వడంతో కుషాయిగూడ ఇన్స్పెక్టర్ భాస్కర్ రెడ్డి బృందం రంగంలోకి దిగింది. ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో బాంబుస్కార్డు బృందాన్ని పిలిపించి తనిఖీలు చేపట్టారు. పెట్టకే లకు ఎటువంటి బాంబు లేదని తేల్చడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

## నేడు బాలాపూర్ ఎస్‌పిఆర్ గార్డెన్స్‌లో అయ్యప్ప మహాపడి పూజ

**సరూర్‌నగర్, డిసెంబర్ 18 ప్రభాతవార్త:** జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్‌లోని బాలాపూర్ ఆర్‌సిఐ రోడ్డులోనున్న ఎస్‌పిఆర్ గార్డెన్స్‌లో శుక్రవారం సరూర్‌నగర్ మాజీ ఎంపిపి, బాలాపూర్ గ్రామ మాజీ పోలీస్ పటేల్ సామల రంగారెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహాపడి పూజోత్సవాన్ని నిర్వహించనున్నారు. బాలాపూర్ సన్నిధానం గురుస్వాముల ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు గణపతి పూజతో మహా పడి పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. మధ్యాహ్నం 12 గంటలకు పడి వెలిగించిన అనంతరం మహా హారతితో పూజలు ముగుస్తాయి. ఆ తర్వాత అయ్యప్ప స్వాములకు, భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ మేరకు అయ్యప్ప స్వాములు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని సామల రంగారెడ్డి కోరారు.



మహేశ్వరం నియోజకవర్గంలో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బిఆర్ఎస్ మద్దతుతో సర్పంచ్‌లుగా, వార్డు మెంబర్లుగా విజయం సాధించిన వారు మర్యాదపూర్వకంగా మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, బిఆర్ఎస్ యువ నాయకుడు కార్తీక్‌రెడ్డిని కలిసిన దృశ్యం



దక్కన్ హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో దక్కన్ బ్లడ్ సెంటర్ సహకారంతో మహేంద్ర ఫైనాన్స్ హోమ్ ప్రాంగణంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో రక్తదానం చేస్తున్న దృశ్యం

## నాచారం పోలీస్ స్టేషన్‌కు ఉత్తమ అవార్డు



ఇన్స్‌పెక్టర్ ధనుంజయ గౌడ్‌కు అవార్డు అందజేస్తున్న వీజే కన్సల్‌టెంట్స్ రీసర్చ్ బృందం

**నాచారం, డిసెంబర్ 18 ప్రభాతవార్త :** క్వాలిటీ మేనేజ్ మెంట్ సిస్టమ్ నిర్వహణ విషయంలో వీజె కన్సల్టెంట్స్ రీసెర్చ్ బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వేలో నాచారం పోలీసు స్టేషన్ కు ఉత్తమ గుర్తింపు లభించింది. ఈ మేరకు సంస్థ ప్రతినిధులు గురువారం ఇన్స్‌పెక్టర్ ధనుంజయ గౌడ్‌ను కలిసి అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ పబ్లిక్ సేఫ్టీ, లా - ఎన్‌ఫోర్స్‌మెంట్, లాఎండ్ ఆర్డర్ మెయింటెనెన్స్, సర్వీసెస్ క్యూ ఆర్ ఓ ఆధ్వర్యంలో కొంత కాలంగా నగరంలోని పోలీసు స్టేషన్లను సందర్శించి సర్వేలు నిర్వహించినట్లు తెలిపారు. అందులో భాగంగా నాచారం పోలీసు స్టేషన్ కు ఉత్తమ గుర్తింపు లభించిందని తెలిపారు. ప్రజలకు భద్రత కల్పించే విషయంలో నేరాల నియంత్రణతో పాటుగా, పోలీసు స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా పెట్టుకోవడాన్ని గుర్తించి వీజె కన్సల్టెంట్స్ రీసెర్చ్ బృందం ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వీజె కన్సల్టెంట్స్ రీసెర్చ్ బృందం గాబ్రియేల్ చేతుల మీదుగా ఈ ధ్రువీకరణ పత్రం నాచారం పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ కె.ధనుంజయ కు అందచేసినట్లుగా తెలిపారు.కార్యక్రమంలో ఎస్ఐలు బి.వెంకటయ్య, ప్రభాకర్ రెడ్డి, మైబెల్లి తో పాటు పోలీసు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.